సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 16 సంచిక: 232

ఆదివారం 12-11-2023



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'



మిచెల్ మార్ష్ వీరవిహారం

వరల్డ్‌కప్ లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా విజయం - స్పోర్ట్స్‌లో



ఘన విజయంతో ఇంగ్లండ్ ఇంటికి

ఓటమితో వరల్డ్‌కప్ నుంచి పాకిస్తాన్ నిష్క్రమణ - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT ANANTAPUR | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

మీ వ్యాఖ్యలు బీజేపీవా? చంద్రబాబువా?

• ఎమ్మెల్సీ వరుదుకళ్యాణి

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో మద్యం అమ్మకాలపై పురందేశ్వరి వ్యాఖ్యలు బీజేపీ తరఫున చేసినవా? లేక చంద్రబాబు తరఫున చేసినవా? ప్రజలకు చెప్పాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి డిమాండ్ చేశారు. పురందేశ్వరి చేసిన వ్యాఖ్యలపై ఆమె శనివారం బహిరంగ లేఖ రాశారు. లేఖలోని ముఖ్యాంశాలిలా ఉన్నాయి. 'రాష్ట్రంలో డిస్టిలరీలు, మద్యం అమ్మకాలపై కొంత కాలంగా చేస్తున్న ఆరోపణలను బ్లాక్‌మెయిల్ రాజకీయాలుగా భావించాలి! బహుశా మీ మరిది చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో 53 రోజులు రిమాండ్‌లో ఉంచడం మీరు ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్నట్టుంది. బెల్టుషాపులతో గుడీ, బడీ తేడా లేకుండా అన్ని చోట్లా మద్యాన్ని ఏరులై పారించింది మీ మరిది పాలనలోనే కదా. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు దుకాణాల్లో, బెల్ట్ షాపుల్లో అమ్మిన సమయంలో.. కేవలం 7 డిస్టిలరీలు 80శాతం ఉత్పత్తి చేసిన ఆ సమయంలో మీ గొంతు ఎందుకు మూగబోయింది? ఇప్పుడు లాభాపేక్ష లేకుండా ప్రభుత్వమే మద్యం అమ్ముతూ, మద్యం దుకాణాలు, మద్యం సేల్స్ తగ్గించి, రేట్లు పెంచి, బెల్ట్ షాపుల్ని పూర్తిగా నిర్మూలించిన జగన్ ప్రభుత్వాన్ని ఎందుకు విమర్శిస్తున్నట్టు? మీ తండ్రి పెట్టిన మద్య నిషేధాన్ని ఎత్తేసిన మీ మరిదికి మద్దతిచ్చి.. మీ తండ్రిని వెన్నుపోటు పొడిచిన మీరు.. ఇప్పటికీ చంద్రబాబు మద్యం విధానమే బాగుందని చెప్తున్నారంటే.. ఇంతకంటే రాజకీయ పతనం ఉంటుందా?' అని లేఖలో పేర్కొన్నారు.

'అమెరికా' ఏం చదువుతోంది?

విద్యార్థుల ఆసక్తిపై నేషనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ స్టాటిస్టిక్స్ అధ్యయనం

- అగ్రదేశంలో కంప్యూటర్ సైన్స్‌కే విశేష ఆదరణ
- ఈ ఒక్క రంగంలోనే దశాబ్దకాలంలో 144 శాతం పెరిగిన గ్రాడ్యుయేట్లు
- వన్నె తగ్గని బిజినెస్ మేనేజ్‌మెంట్
- ఏటా దాదాపు 4 లక్షల మంది 'బిజినెస్' గ్రాడ్యుయేట్లు తయారీ
- లిబరల్ ఆర్ట్స్‌లో తగ్గుతున్న చేరికలు.. సామాజికశాస్త్రాలదీ అదేతీరు
- ఆకర్షణీయ ఉపాధి, ఉద్యోగ అవకాశాలవైపే అమెరికా విద్యార్థుల మొగ్గు





(ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)

అమెరికాలో విద్యనభ్యసించడం వివిధ దేశాలకు చెందిన ఎన్నో లక్షల మంది విద్యార్థుల స్వప్నం. ఎన్నో కష్టాలు పడి, వివిధ పరీక్షలు రాసి అమెరికాకు పరుగులు తీస్తుంటారు. అక్కడే గ్రాడ్యుయేషన్లు, పోస్ట్‌గ్రాడ్యుయేషన్లు చేసి.. ఉద్యోగాలు కూడా సంపాదించి స్థిరపడిపోతుంటారు. కానీ అసలు అమెరికా విద్యార్థులు ఏం చేస్తున్నారు? ఏఏ కోర్సులు ఎక్కువగా చదువుతున్నారు? ఏఏ రంగాలపై ఆసక్తి చూపిస్తున్నారు? అనే ప్రశ్నలు మనలో తలెత్తుతుంటాయి. ఈ అంశాలపై అమెరికాకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ స్టాటిస్టిక్స్ (ఎన్‌సీఈఎస్) అధ్యయనం చేసి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. పలు ముఖ్యమైన కోర్సులపై అధ్యయనం చేసింది. 2010-11 విద్యా సంవత్సరంలో వివిధ సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థుల సంఖ్యతో.. సరిగ్గా దశాబ్దం తర్వాత అంటే 2020-21లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థుల సంఖ్యతో పోల్చి గణాంకాలు రూపొందించింది.

కంప్యూటర్ సైన్స్‌కే పట్టం

అమెరికాలో కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుకే విద్యార్థుల నుంచి విశేష ఆదరణ దక్కింది. దశాబ్దకాలం తర్వాత కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్లు 144 శాతం పెరిగారు. 2010-11లో 43,066 మంది కంప్యూటర్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగా, 2020-21లో ఈ రంగం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థుల సంఖ్య 1,04,874కు పెరిగింది. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతంగా అందుబాటులో ఉండటం, భవిష్యత్‌ను శాసించే శక్తి ఉందని యువత భావించడం వల్లే దీనిపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

వైద్య రంగంలోనూ భారీ వృద్ధి: వైద్య, ఆరోగ్య రంగంలోని విస్తృత అవకాశాలు కూడా అమెరికా విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. 2010-11తో పోల్చితే.. 2020-21 విద్యా సంవత్సరంలో 87 శాతం వృద్ధితో 2.6 లక్షల మంది విద్యార్థులు ఈ రంగంలో పట్టాలు అందుకున్నారు. అమెరికాలోని మొత్తం గ్రాడ్యుయేట్లలో వైద్య, ఆరోగ్య రంగంలో పట్టభద్రులైన విద్యార్థుల సంఖ్య దాదాపు 13 శాతం. అలాగే బయోమెడికల్ సైన్స్‌లోనూ 46 శాతం వృద్ధి నమోదైంది. కోవిడ్ సంక్షోభం తర్వాత ఈ విభాగంలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

వన్నె తగ్గని ఇంజనీరింగ్ కోర్సులు

కంప్యూటర్ సైన్స్‌ను మినహాయించి మిగతా బ్రాంచ్‌లను ఇంజనీరింగ్ కింద పరిగణించారు. దశాబ్దకాలంలో 65 శాతం వృద్ధితో 1.26 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు 2020-21లో కాలేజీల నుంచి పట్టాలతో బయటకు వచ్చారు. ఏటా లక్ష డాలర్లకు తగ్గని వేతనాలు, ఎలాంటి పరిస్థితుల్లో అయినా ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొదవ ఉండదనే భరోసా.. ఈ రంగం వైపు విద్యార్థులు ఆకర్షితులవ్వడానికి కారణమని నిపుణులు అంచనా వేస్తున్నారు. భవిష్యత్ ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా మారుతున్న వారిలో ఇంజనీరింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వారి శాతమే ఎక్కువ.

దాదాపు 4 లక్షల మంది..

అమెరికాలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌కు ఆదరణ ఏటా పెరుగుతూనే ఉంది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తున్న వారిలో అత్యధికులు ఈ రంగం వారే. 2020-21లో దాదాపు 4 లక్షల మంది ఈ విభాగంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

పడిపోతున్న 'ఆర్ట్స్'

అమెరికాలో పలు ఆర్ట్స్ గ్రూప్‌లకు ఆదరణ తగ్గుతోంది. సామాజిక శాస్త్రాలు, భాషలు, చరిత్ర లాంటి 17 సబ్జెక్టుల్లో గత దశాబ్దకాలంలో విద్యార్థుల చేరికలు తగ్గినట్టు తేలింది. ఇంగ్లిష్, చరిత్ర తదితర సబ్జెక్టుల్లో దశాబ్దకాలంలో 35 శాతం విద్యార్థుల సంఖ్య పడిపోయింది. పాకశాస్త్రంలో తగ్గుదల 50 శాతానికిపైగా ఉంది.

ఉపాధి అవకాశాలున్నా.. తగ్గిన చేరికలు

అమెరికాలో ఎడ్యుకేషన్ రంగంలో గ్రాడ్యుయేషన్ చేసే వారి సంఖ్య తగ్గుతోంది. టీచర్ల వేతనాలు పెద్దగా పెరగకపోవడం ఈ రంగంలోకి విద్యార్థులు రాకపోవడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. టీచర్ల కొరత ఉన్నందున ఉద్యోగావకాశాలు సులభంగా దక్కే అవకాశం ఉన్నా.. ఇతర రంగాల వైపే విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. దశాబ్దకాలంలో 16 శాతం మేర చేరికలు తగ్గాయి. అలాగే మారుతున్న ప్రపంచంలో పరిశ్రమలు స్పెషలైజేషన్‌ను కోరుకుంటుండటంతో విద్యార్థులు కూడా లిబరల్ ఆర్ట్స్‌వైపు ఆసక్తి చూపించం లేదు. దీంతో విద్యార్థుల సంఖ్య దశాబ్దకాలంలో 10 శాతం తగ్గింది. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన ఇంగ్లిష్‌దీ ఇదే పరిస్థితి.

సబ్జెక్టుల వారీగా గ్రాడ్యుయేట్ల పెరుగుదల, వృద్ధి

సబ్జెక్టు	2010-11లో గ్రాడ్యుయేట్లు	2020-21లో గ్రాడ్యుయేట్లు	వృద్ధి శాతం
బిజినెస్ మేనేజ్‌మెంట్	3,63,919	3,90,781	7
వైద్యం	1,43,463	2,68,018	87
బయోమెడికల్ సైన్స్	89,984	1,31,499	46
సైకాలజీ	1,00,906	1,26,944	26
ఇంజనీరింగ్	76,356	1,26,037	65
కంప్యూటర్ సైన్స్	43,066	1,04,874	144
కమ్యూనికేషన్	83,231	90,775	9
శాంతిభద్రతలు	47,600	58,009	22
ఇంటర్‌డిసిప్లినరీ స్టడీస్	42,473	54,584	29
ఫిట్‌నెస్ స్టడీస్	35,934	54,294	51
పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్	26,799	34,817	30
ఫిజికల్ సైన్స్	24,338	28,706	18
మేథమేటిక్స్	17,182	27,092	58
అగ్రికల్చర్	15,851	21,418	35
నేచురల్ రిసోర్సెస్	12,779	20,507	60
ఇంజనీరింగ్ టెక్నాలజీస్	16,187	18,562	15
ట్రాన్స్‌పోర్టేషన్	4,941	5,993	21
లీగల్	4,429	4,589	4
మిలిటరీ టెక్నాలజీస్	64	1,524	2,281
సైన్స్ టెక్నాలజీస్	367	532	45
లైబ్రరీ సైన్స్	96	119	24

సబ్జెక్టుల వారీగా గ్రాడ్యుయేట్ల తగ్గుదల

సబ్జెక్ట్/రంగం	2010-11లో గ్రాడ్యుయేట్లు	2020-21 గ్రాడ్యుయేట్లు	తగ్గుదల శాతం
సామాజిక శాస్త్రాలు	1,42,161	1,37,908	3
విజువల్, ఫెర్ఫార్మింగ్ ఆర్ట్	93,939	90,022	4
ఎడ్యుకేషన్	1,04,008	89,398	16
లిబరల్ ఆర్ట్స్	46,717	41,909	11
ఇంగ్లిష్	52,754	35,762	47
చరిత్ర	35,008	22,919	53
హ్యూమన్ సైన్సెస్	22,438	22,319	0.5
ఫారిన్ లాంగ్వేజెస్	21,705	15,518	40
ఫిలాసఫీ, రిలీజియస్ స్టడీస్	12,830	11,988	7
ఆర్కిటెక్చర్	9,831	9,296	6
కల్చరల్ అండ్ జెండర్ స్టడీస్	8,955	7,374	21
థియాలజీ	9,073	6,737	35
కమ్యూనికేషన్ టెక్	4,858	4,557	6
కలినరీ సర్వీసెస్	1,214	594	104
కన్‌స్ట్రక్షన్ ట్రేడ్స్	328	221	48
మెకానిక్ అండ్ రిపేర్	226	221	2
ప్రెసిషన్ ప్రొడక్షన్	43	28	53



పట్టణాలకు పచ్చదనం అందాలు..

- ఎకో టూరిజం ప్రాజెక్టు కింద త్వరలో 100 నగర వనాలు ఏర్పాటు
- ఇప్పటికే 11 చోట్ల సిద్ధం, డిసెంబర్ నాటికి మరో 30 రెడీ
- మార్చికల్లా మిగిలిన వాటిని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఆహ్లాదం, వినోదం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న నగర వనాలు త్వరలో మరో 100 అందుబాటులోకి రానున్నాయి. భూమి లభ్యతను బట్టి ప్రతి జిల్లాలో కనీసం 2 నుంచి 4 నగర వనాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రకృతిని ఆస్వాదించేందుకు, ప్రకృతి ఒడిలో సేద తీరేందుకు ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతుండటంతో వీటి ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజల అభిరుచులకు అనుగుణంగా అన్ని సౌకర్యాలతో నగర వనాలను తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మంగళగిరి, పేరేచర్ల, దివాన్‌చెరువు (రాజమహేంద్రవరం),కడప, అనంతపురం, నెల్లూరు, తిరుపతిలో ఒక్కోటి చొప్పున, కర్నూలు, చిత్తూరులో 2 చొప్పున నగర వనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. మరో 30కి పైగా నగర వనాలను డిసెంబర్‌లోపు, మిగిలిన వాటిని మార్చి నెలాఖరులోపు సిద్ధం చేయడానికి అటవీ శాఖ ప్రయత్నాలు చేస్తోంది.

ప్రతి జిల్లాలో 2, 3 ఏర్పాటుకు సన్నాహాలు

కొన్ని పట్టణాల్లో భూమి దొరక్కపోవడంతో నగర వనాల ప్రణాళిక ఆలస్యమైంది. భూమి అందుబాటులో ఉన్న చోట 2, 3 నగర వనాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. చిత్తూరు వద్ద అటవీ ప్రాంతం ఎక్కువ ఉండటంతో అక్కడ 2 నగర వనాలను తీర్చిదిద్దారు. అనంతపురం టౌన్ దగ్గర్లో ఎక్కడా అటవీ భూమి లేదు. దీంతో అక్కడ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో భూమి కోసం సంప్రదింపులు జరుపుతున్నారు. అలాంటి చోట్ల కొద్దిగా ఆలస్యమైనా మిగిలిన ప్రాంతాల్లో త్వరితగతిన నగర వనాలు సిద్ధమవుతున్నాయి. కొన్నిచోట్ల భూమి లేకపోయినప్పుడు అక్కడ అందుబాటులో ఉండే పెద్ద సంస్థలు, పెద్ద కాలేజీలు, క్యాంపస్‌లలో ఎక్కువ భూమి ఉంటే అలాంటిచోట్ల నగర వనాలను అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో పాటు కార్పొరేషన్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఆయా ప్రాంతాల్లోని కార్పొరేట్ సంస్థలు, కంపెనీలను సంప్రదిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు, ఆయా ప్రాంతాల ప్రజలను వీటి ఏర్పాటులో భాగస్వాముల్ని చేస్తున్నారు. వాకర్స్ క్లబ్‌లు, స్థానిక ప్రముఖులను కూడా కలిసి వీటి గురించి వివరించి నిధులు సమకూర్చి, వారి ద్వారానే వాటిని నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు.

ఎకో టూరిజం నిబంధనలకు అనుగుణంగా..

పచ్చదనంతో కూడిన స్వచ్ఛమైన పరిసరాలు నగర వనాల్లో ఉండేలా చూస్తున్నారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు అన్ని వయసుల వారు అక్కడకు వచ్చి ఆహ్లాదంగా గడిపేందుకు నగర వనాలను తీర్చిదిద్దుతున్నారు. పిల్లలు ఆడుకునేందుకు పలు రకాల క్రీడా సౌకర్యాలు, వాకింగ్ ట్రాక్, యోగా, వెల్‌నెస్ సెంటర్, అరుదైన చెట్ల పెంపకం వంటివన్నీ అక్కడ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ ఎకో టూరిజం నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా వీటిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

ప్రకృతి అందాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లనక్కర్లేదు

ప్రకృతి అందాలను వీక్షించేందుకు ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళుతున్నారు. వారి నివాసాలకు సమీపంలోనే ప్రకృతి సహజసిద్ధ ప్రాంతాలున్నాయి. వాటిని నగర వనాలుగా తీర్చిదిద్దుతున్నాం. ప్రస్తుతం రాష్ట్రంలో 30 నగర వనాలున్నాయి. మరో 100 వనాలను ఏర్పాటు చేస్తున్నాం.

– ఎస్ మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర అటవీ దళాల అధిపతి, ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్

సాక్షి అనంతపురం

ఆదివారం । 12 । నవంబర్ । 2023



బొలెరో బీభత్సం

పంపనూరులో బొలెరో బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. 2లో



టమాట కిలో రూ.28

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.28 పలికింది. కనిష్టం రూ.12, సరాసరి రూ.18 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.7°/21.2°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఈశాన్యం దిశగా గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

దీపావళి.. ఆనంద కేళి



అనంతపురం శ్రీనగర్‌కాలనీ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో టపాసుల విక్రయాలు

అనంతపురం కల్చరల్: చీకటిపై వెలుగు విజయమే దీపావళి. దుష్ట శక్తులను పారదోలి కొంగొత్త జీవితానికి స్వాగతం పలికే పండుగకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. అప్పుడే ప్రతి ఇంటా దీపావళి శోభ సంతరించుకుంది. ఆదివారం జిల్లా అంతటా టపాసుల మోత మోగనుంది. ఇప్పటికే బాణాసంచా కొనుగోళ్లతో పాటు కొత్త వస్తువులను పండుగ రోజు కొనడానికి ఆసక్తి కనపరుస్తుండడంతో వస్త్ర, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

లక్ష్మీదేవికి స్వాగతం

సకల శుభాలు, సంపదలు ప్రసాదించే లక్ష్మీదేవిని దీపావళి రోజున ప్రత్యేకంగా ఆరాధించడం సంప్రదాయం. ఈ పర్వదినాన సాక్షాత్తు మహాలక్ష్మి భూలోకానికి వచ్చి ఇల్లిల్లూ తిరుగుతుందని అందరి నమ్మకం. అందు కోసమే ప్రతి ఇంటా దీపకాంతులు తేజోమయమై లక్ష్మీదేవిని ఆహ్వానించేందుకు ఏర్పాట్లు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలతో పాటు వైష్ణవాలయాలు ప్రత్యేక లక్ష్మీపూజలకు సిద్ధమయ్యాయి.

చిన్నారుల మధ్య ఎస్పీ దీపావళి సంబరాలు

అనంతపురం క్రైం: దీపావళి పండుగను ఎస్పీ అన్బురాజన్ వినూత్నంగా జరుపుకొన్నారు. పండుగను పురస్కరించుకుని శనివారం అనంతపురంలోని ఎన్టీఆర్ కాలనీలోని షికారి పిల్లలను తన చాంబర్‌కు రప్పించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 60 మంది పిల్లలతో ఎస్పీ ముచ్చటించారు. చదువుకుని ఏమవుతారని ప్రశ్నించగా.. కొందరు కలెక్టర్, మరికొందరు పోలీస్, ఆర్మీ, ఇంకొందరు డాక్టర్ తదితర అధికారులవుతామని చెప్పారు. అనంతరం పిల్లలందరికీ నూతన వస్త్రాలతో పాటు స్వీట్లు, టపాసుల బాక్సులు అందజేసి దీపావళి సంబరాలు చేసుకున్నారు. అభం శుభం తెలియని వయసులో దీపావళి అనగానే మరింత ఉత్తేజంతో ఆడుకునే పిల్లల మధ్య సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని ఎస్పీ అన్నారు. తనకు ఇదే నిజమైన దీపావళి అని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, డీసీఆర్బీ సీఐ విశ్వనాథచౌదరి తదితరులు పాల్గొన్నారు.



దీపావళి గిఫ్ట్ ప్యాక్ అందుకున్న చిన్నారులతో ఎస్పీ అన్బురాజన్

న్యూస్‌రీల్

నవజాత శిశు కేంద్రం పనులు వేగవంతం



ఫొటోథెరపీ, వార్మర్లను ఏర్పాటు చేస్తున్న నర్సింగ్ సిబ్బంది

అనంతపురం మెడికల్: పసికందులకు మరింత నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేయనున్న మరో నవజాత శిశు కేంద్రం పనులు వేగవంతంగా సాగుతున్నాయి. సర్వజనాస్పత్రిలోని కాన్పుల వార్డు పక్కన ఉన్న నవజాతా శిశు కేంద్రం పై అంతస్తులో 20 పడకల సామర్థ్యంతో మరో కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కేంద్రంలో ఇన్‌బార్న్, ఔట్‌బార్న్, మదర్స్ ఫీడింగ్ రూం, వైద్యుల గది, తదితర వాటి పనులు పూర్తయ్యాయి. మొత్తం 9 అమర్చారు. ఇటీవల ఆస్పత్రి మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు రూ.3.5 కోట్లు కేటాయించిన విషయం విదితమే. ఆ నిధుల నుంచి రూ.7 లక్షల వరకు ఆక్సిజన్, గ్యాస్ పైప్‌లైన్, మదర్స్ రూం కోసం వెచ్చించారు. ఈ లెక్కన గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.35 లక్షలు కలుపుకుని మొత్తం రూ.42 లక్షలతో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మరో మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నూతన నవజాతా శిశు కేంద్రాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అందులో అనంతపురం సర్వజనాస్పత్రిలోని నూతన కేంద్రాన్ని కూడా ప్రారంభిస్తారని తెలిసింది.

టీబీ డ్యాంకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం)లో ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. ఈ నెల 9న 0 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో రెండు రోజులుగా పునః ప్రారంభమై శనివారం ఉదయం 6,465 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాం ఎగువ భాగంలో వర్షాలు కురవడంతో వరద పెరుగుతోంది. 105.788 టీఎంసీల పూర్తి సామర్థ్యం ఉన్న జలాశయంలో ప్రస్తుతం 25.402 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 1,633 అడుగు కాగా, ప్రస్తుతం 1,602.83 అడుగుల నీటి మట్టం నమోదైంది. జలాశయం నుంచి 8,512 క్యూసెక్కుల నీరు రైట్ బ్రాంచ్ మెయిన్ కెనాల్, లెఫ్ట్ బ్రాంచ్ మెయిన్ కెనాల్‌కు సంబంధించి వివిధ కాలువలకు విడుదల చేస్తున్నారు. ఇందులో ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు 2,898 క్యూసెక్కులు వదులుతుండగా ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద 1,857 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

అనంతపురం అర్బన్/ క్రైం: ప్రజలకు మంత్రి ఉష శ్రీచరణ్, కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ చీకట్లను పారదోలి ప్రజల జీవితాల్లో మరిన్ని కాంతులు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే దీపావళి పర్వదినాన జాగ్రత్తలతో టపాసులు కాల్చాలని... పిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు.

రేపు 'స్పందన' రద్దు

అనంతపురం అర్బన్: దీపావళి పండుగను పురస్కరించుకుని ఈ నెల 13న సెలవు ఉన్నందున ఆ రోజున కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన 'స్పందన' కార్యక్రమం రద్దు చేసినట్లు డీఆర్‌ఓ గాయత్రీదేవి తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి అర్జీలు ఇచ్చేందుకు ఎవ్వరూ జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

టీడీపీ నేతల దాష్టీకం

- సచివాలయ లైన్‌మెన్‌పై దాడి



బాధిత లైన్‌మెన్ ఇస్రాయిల్

తాడిపత్రిటౌన్: విద్యుత్తు బిల్లు చెల్లించాలని అడిగిన లైన్‌మెన్‌పై టీడీపీ నాయకులు దాష్టీకం ప్రదర్శించారు. చెప్పుతో దాడి చేసి అవమానపరిచారు. బాధితుడు తెలిపిన మేరకు... యర్రగుంటపల్లిలో ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో టీడీపీ నాయకుడు నారాయణస్వామి ఇంటిలో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించి జరిమానా విధించారు. తమకు ఫైన్ పడటానికి సచివాలయ లైన్‌మెన్ ఇస్రాయిలే కారణమని నారాయణస్వామి కక్ష పెంచుకున్నాడు. తాజాగా నవంబర్‌లో అసెస్మెంట్, కాంపౌండ్ చార్జెస్‌తో కలుపుకొని రూ.5,527 బిల్లు వచ్చింది. ఈ మొత్తం చెల్లించాలంటూ శనివారం ఇంటికి వచ్చిన లైన్‌మెన్‌తో నారాయణస్వామి గొడవకు దిగాడు. నీ వల్లే మాకు ఇంత బిల్లు పడిందంటూ మండిపడ్డాడు. ఇంతలో నారాయణస్వామి కుమారుడు లక్ష్మీనారాయణ అలియాస్ శివ ఇంట్లోంచి బయటకు వచ్చి ఆగ్రహంతో ఊగిపోతూ చెప్పుతో లైన్‌మెన్‌పై దాడి చేశాడు. విద్యుత్తు మీటర్ తిరగకుండా చేసి.. విజిలెన్స్ దాడుల్లో దొరికిపోయి.. బిల్లు అడిగినందుకు తనపై దాడి చేయడంపై బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నేత్రపర్వం.. మహాకుంభాభిషేకం



కుంభాలలో జలాన్ని తీసుకొస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు



శివకోటి ఆలయ గోపురంపై అభిషేకం చేస్తున్న స్వాములు

అనంతపురం కల్చరల్: నగరంలోని శివకోటి శ్రీపీఠంలో మహాకుంభాభిషేకం నేత్రపర్వంగా సాగింది. శనివారం వందల సంఖ్యలో వేద పండితులు విచ్చేశారు. ఈ సందర్భంగా సామూహిక వేదపారాయణం, వేదమంత్రోచ్చారణలు, వివిధ రకాల హోమాలతో ఆలయ ప్రాంగణం శోభాయమానంగా మారింది. శివకోటి వ్యవస్థాపకులు శివయ్యస్వామీజీ నేతృత్వంలో జరిగిన చండీ తర్పణం, వేదస్వస్తి, మంగళనీరాజనం ముగింపు వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు ఆత్మీయ అతిథులుగా హాజరై అమ్మవారికి మహా సంప్రోక్షణ చేశారు. మంత్రితో పాటు హాజరైన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ,



ప్రత్యేక అలంకరణలో లలిత శివ కామేశ్వరీ దేవి

అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, టీటీడీ పాలక మండలి సభ్యుడు అశ్వత్థనాయక్, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్ గౌడ్ తదితరులకు ఆలయ నిర్వాహకులు వేదమంత్రాలు, బాజాభజంత్రీల నడుమ శ్రీవారి శేషవస్త్రాలనందించి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆదివారం పూర్ణాహుతితో మహా సంప్రోక్షణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా ముగుస్తాయని నిర్వాహకులు కోరారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. చంద్రబాబు హయాంలో విజయవాడలో కూల్చేసిన ఆలయాలను తమ ప్రభుత్వం సర్వాంగ సుందరంగా పునఃనిర్మిస్తోందని గుర్తు చేశారు. ఆలయ నియమాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు సీఎం కావాలని శివకోటి ఆలయంలో జరిపిన ప్రత్యేక పూజల్లో కోరుకున్నానని చెప్పారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు అనంత క్రీడాకారులు



జమ్మూకశ్మీర్‌కు బయలుదేరిన క్రీడాకారులు

అనంతపురం: ఈ నెల 15 నుంచి 19 వరకు జమ్మూ కశ్మీర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే జాతీయ స్థాయి జూడో పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టు తరఫున పాల్గొనేందుకు జిల్లా క్రీడాకారులు తరలి వెళ్లారు. అండర్-14 బాలబాలికల విభాగంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి ఏపీ జట్టులో లాస్య, నందిని, విక్రాంత్, యశ్వంత్, అఫ్జల్, అస్మిత చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ప్రయాణమైన క్రీడాకారులకు అనంతపురం రైల్వే స్టేషన్‌లో ఎస్‌జీఎఫ్ ఉభయ జిల్లాల కార్యదర్శులు సుగణమ్మ, అంజన్న, జిల్లా కో-ఆర్డినేటర్ ఎల్.నాగరాజు, చల్లా ఓబులేసు, వేణుగోపాల్, కోటప్ప, శకుంతల, కోచ్ ప్రతాప్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు. జాతీయ స్థాయిలోనూ ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులతో పాటు టీం మేనేజర్ ముస్తఫాకుమార్‌రాజా తరలివెళ్లారు.

22న పుట్టపర్తికి రాష్ట్రపతి రాక

- సత్యసాయి డీమ్డ్ వర్సిటీ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొననున్న ద్రౌపది ముర్ము
- భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఉన్నతాధికారులు



శ్రీనివాస అతిథి గృహం వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, జేసీ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాకేంద్రం పుట్టపర్తికి ఈ నెల 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్నారు. సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొంటారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా ఉత్సవంలో పాల్గొననున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి, జేసీ చేతన్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులతో కలసి భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ప్రముఖులు బస చేసే శాంతి భవన్ అతిథి గృహం, సాయి శ్రీనివాస అతిథి గృహం, సాయి హీరా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, సాయి కుల్వంత్ సభా మందిరం, గోపురం గేట్, వెస్ట్ గేట్ తదితర ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. వాహన పార్కింగ్ తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో చర్చించారు.

లోపాలు తలెత్తనీయొద్దు..

నవంబర్ 18 నుంచి 24 వరకూ సాగనున్న సత్యసాయి జయంత్యుత్సవాలకు దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నట్లు ఎస్పీ మాధవ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా పకడ్బందీగా వ్యవహరించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ప్రత్యేక విమానంలో సత్యసాయి విమానాశ్రయం చేరుకోనున్న రాష్ట్రపతి.. అక్కడి నుంచి రోడ్డు మార్గాన పుట్టపర్తికి చేరుకోనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, అడిషనల్ ఎస్పీ ఎన్.విష్ణు, డీఎస్పీ వాసుదేవన్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్పీ సీఐ రవీంద్రారెడ్డి, పట్టణ సీఐ కొండారెడ్డి, ఆర్ఐ టైటాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాక్స్‌లను చూపుతున్న సెబ్ పోలీసులు

అనంతపురం క్రైం: కర్ణాటక రాజధాని బెంగళూరు నుంచి గుంతకల్లుకు అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను అనంతపురంలోని సెబ్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెబ్ ఏఎస్పీ రామకృష్ణ వెల్లడించారు. బెంగళూరుకు చెందిన శ్రీనివాస్, చేతన్ కర్ణాటక నుంచి గుంతకల్లుకు కారులో మద్యం తరలిస్తుండగా ప్రత్యేక బృందంలోని సీఐ నరసానాయుడు, జగదీశ్వర రెడ్డి, గురునాథ్‌రెడ్డి, ఆంజినేయులు, హెడ్‌కానిస్టేబుల్ మురళి, రామచంద్ర, కానిస్టేబుల్ మారుతి, రాజ్‌గోపాల్, రమణ మరూరు టోల్ ప్లాజా వద్ద కాపుకాచి పట్టుకున్నారు. 29 బాక్స్‌ల మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, గుంతకల్లులో ఎవరికి సరఫరా చేస్తున్న అంశంపై ఆరా తీస్తున్నారు.

15 నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి గుంతకల్లు మండల వ్యాప్తంగా ధర్మ ప్రచార వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ శనివారం వెల్లడించారు. బుధవారం జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ప్రారంభించనున్నారు. వారోత్సవాల్లో భాగంగా తొలి రోజు గుంతకల్లు మండలం గుండాల తండాలో కార్యక్రమం ఉంటుంది. 16న వైటీ చెరువులో నెట్టికంటి ఆంజనేయస్వామి గ్రామోత్సం, 17న కసాపురంలోని దేవస్థానంలో ఉదయం 10 నుంచి సామూహిక సహస్రనామ కుంకుమార్చన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 18న సాయంత్రం కసాపురం ఆలయంలో వెండి రథోత్సవం, రాత్రి 10 గంటలకు పంచమాంకములు నాటక ప్రదర్శన, 19న నాగసముద్రంలో గ్రామోత్సవం, 20న నెట్టికంటి ఆంజనేయస్వామి అనుభంద దేవాలయమైన కాశీ విశ్వేశ్వరాలయంలో రుద్రాభిషేకము, రుద్రహోమము నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి నెట్టికంటుడి సన్నిధిలో లక్ష దీపోత్సవం ఉంటుంది. 21న ఆలయంలో సుందర కాండ పారాయణము, సాయంత్రం శోభాయాత్రతో ఉత్సవాలు ముగుస్తాయి.

బొలెరో బీభత్సం

- పంపనూరులో జనంపైకి దూసుకెళ్లిన బొలెరో వాహనం
- ఇద్దరి దుర్మరణం
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు



షఫి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



మృతుడు సూరెప్ప



పోలీసులతో వాదిస్తున్న గ్రామస్తులు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఆత్మకూరు: అకస్మాత్తుగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొని ఇద్దరు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆత్మకూరు మండలం పంపనూరులో శనివారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో ఓ పెళ్లి వేడుక జరుగుతోంది. పెళ్లికి వచ్చిన వారు ఆచారం ప్రకారం రోడ్డు పక్కన ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం రాత్రి పది గంటలకు పూజలు నిర్వహించేందుకు వెళ్లారు. ఆ సమయంలో అనంతపురం నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న షఫీ (33) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో డ్రైవర్ పూర్తిగా నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును ఢీ కొట్టాడు. అదే వేగంతో పక్కనే ఉన్న జనాల్లోకి దూసుకెళ్లాడు. దీంతో ప్రజలు దిక్కుకొకరుగా పరుగు తీశారు. ఆ సమయంలో బొలెరో కిందపడి సూరప్ప (55) దుర్మరణం పాలయ్యాడు. పెళ్లి ఊరేగింపు చూసేందుకు ఇంట్లో నుంచి బయటకు వచ్చిన సూరప్ప భార్య అక్కమ్మ, గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, రామప్ప, అనిల్, బోనేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో అక్కమ్మ పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. బొలెరో డ్రైవర్ అజాగ్రత్త, అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఘటన తర్వాత డ్రైవర్ వాహనం దిగి పరారయ్యాడు. అదే వాహనంలోని మరొకరిని గ్రామస్తులు పట్టుకున్నారు.

అత్తారింటికి వచ్చి...

ఉరవకొండ మండలం మైలారంపల్లికి చెందిన షఫీ శనివారం పంపనూరులోని అత్తారింటికి వచ్చాడు. రాత్రి పది గంటలకు అలా బయటకు వచ్చిన అతను రోడ్డు దాటుతున్న క్రమంలో బొలెరో ఢీకొంది. తల ఛిద్రం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి ఐదేళ్ల వయసున్న ఓ కుమారుడు, మూడేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. మరో మృతుడు సూరప్ప పంపనూరు గ్రామంలో వ్యవసాయ కూలీగా జీవనం సాగించేవాడు. తొలుత షఫీని ఢీకొన్న బొలెరో దాదాపు 50 మీటర్ల దూరంలో ఉన్న సూరప్పనూ ఢీకొని ప్రాణాలు బలిగొందంటే డ్రైవర్ నిర్లక్ష్యం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. ఘటనపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ షర్మిల, సీఐ నరేంద్రరెడ్డి, ఎస్‌ఐ జనార్దన్ పరిశీలించారు. బస్టాండ్, ఆలయానికి వెళ్లే దారిలో స్పీడ్ బ్రేకర్లు వేయించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు. వారితో చర్చించేందుకు వచ్చిన పోలీసులతో తీవ్రస్థాయిలో వాగ్వాదం చేశారు. ఇంకెన్ని ప్రాణాలు పోవాలో చెప్పాలంటూ నిలదీశారు. అధికారుల హామీతో చివరకు ఆందోళన విరమించారు.

రూ.1.22 కోట్లతో గోదాముల నిర్మాణం

కూడేరు: మండల పరిధిలో రూ.1.22 కోట్ల వ్యయంతో రెండు గోదాములను కో–ఆపరేటివ్ బ్యాంక్ తరుపున నిర్మించనున్నట్లు ఆ బ్యాంక్ జిల్లా అధికారి ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. కూడేరులోని అనంత వెంకటరెడ్డి కాలనీ సమీపంలో రూ.40 లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాము నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే రూ.82 లక్షల వ్యయంతో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న మరో గోదామును సంగమేశ్వర స్వామి ఆలయ గోశాల వద్ద నిర్మాణం చేయబోతున్నట్లు వివరించారు. పంటల దిగుబడికి గిట్టుబాటు ధర లేనప్పుడు వాటిని ఈ గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చునన్నారు. గోదాముల్లో సరుకు నిల్వ లేనప్పుడు ప్రైవేట్ వ్యక్తులు ఎవరైనా శుభకార్యాలు చేసుకునేందుకు అద్దెకు ఇచ్చి, సమకూరిన ఆదాయంతో సొసైటీ బ్యాంక్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

దిశ ఎస్‌ఐగా స్వర్ణతేజ



అనంతపురం క్రైం: దిశ అనంతపురం మహిళా పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా స్వర్ణతేజ శనివారం బాధ్యతలు స్వీకరించారు. దిశ డీఎస్పీ ఆంథోనప్పను ఈ సందర్భంగా ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. స్వర్ణతేజ గతంలో చిత్తూరు జిల్లా పెద్దపంజాణి పోలీసు స్టేషన్‌లో పనిచేశారు.

లౌకికవాద స్ఫూర్తిదాత అబుల్ కలాం



మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పైలా నరసింహయ్య, తదితరులు



నివాళులర్పిస్తున్న జేసీ కేతన్‌గార్గ్, మేయర్ వసీం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: లౌకికవాదాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన స్ఫూర్తిదాత మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని, దేశంలో మత కలహాలకు తావు లేకుండా అందరూ కలసికట్టుగా ముందుకెళుతున్నారంటే అది ఆజాద్ గొప్పతనమేనని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి కొనియాడారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ఎమ్మెల్యేతో పాటు పలువురు పార్టీ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో పాలు పంచుకున్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ దాదాపు పదేళ్ల పాటు జైలు జీవితం అనుభవించారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికీ విద్యానందించాలని తపనతో స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఏర్పాటైన ప్రభుత్వంలో కేంద్ర విద్యాశాఖా మంత్రిగా ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చారన్నారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఏర్పాటు మౌలానా అబుల్ కలాం చలవేనన్నారు. ఆయన స్ఫూర్తితోనే సీఎం వైఎస్ జగన్ సైతం విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేశారన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. నేటి యువతకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు సైఫుల్లాబేగ్, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, పామిడి వీరాంజనేయులు, రిలాక్స్ నాగరాజు యాదవ్, అనిల్‌కుమార్‌గౌడ్, వేమలనదీం, వెన్నపూస రామచంద్రారెడ్డి, జావేద్, కృష్ణవేణి, రాధాయాదవ్ పాల్గొన్నారు.

అబుల్ కలాం అందించిన సేవలు అమూల్యం

అనంతపురం అర్బన్: భారత తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు అమూల్యమని జేసీ కేతన్‌గార్గ్, నగర పాలక సంస్థ మేయర్ వసీం అన్నారు. మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ సంక్షేమ దినం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జేసీ, మేయర్ ముఖ్యఅతిథులుగా హాజరై ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించి, మాట్లాడారు. దేశానికి ఆయన చేసిన అమూల్యమైన సేవలకు గుర్తుగా ఆయన మరణానంతరం 1992లో భారతరత్న పురస్కారంతో భారత ప్రభుత్వం గౌరవించిందన్నారు. అలాంటి మహనీయుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్.ఎం.ఉమాదేవి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డ్ జిల్లా అధ్యక్షుడు రిజ్వాన్, కార్పొరేటర్లు సైఫుల్లా బేగ్, ఇషాక్, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి ఖాజా, మత పెద్దలు రఫీక్ మౌలానా, చాందినీ మసీద్ ముతవల్లి మహమ్మద్ రఫి, నూర్‌బాషా సంఘం జిల్లా అధ్యక్షుడు నిజాం, రహీమ్, మైనారిటీ సంక్షేమాధికారి మహమ్మద్ రఫి, జిల్లాధికారులు, ఉర్దూ అకాడమీ, వక్ఫ్‌బోర్డ్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ క్రికెట్ జట్టు బ్యాటింగ్ కోచ్‌గా ప్రసాదరెడ్డి

- ట్రైనర్‌గా బొమ్మన్న



ఎల్ఎస్ ప్రసాదరెడ్డి, బొమ్మన్న

అనంతపురం: విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొనే ఆంధ్రా సీనియర్ క్రికెట్ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా అనంతపురానికి చెందిన ఎల్ఎస్ ప్రసాదరెడ్డిని ఎంపిక చేశారు. ఈ నెల 12 నుంచి 21వ వరకూ విశాఖపట్నంలో కోచింగ్ క్యాంప్ నిర్వహించనున్నారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం ముత్యాల చెరువుకు చెందిన ఆయన బీసీసీఐ లెవల్–1 కోచింగ్ కోర్సును పూర్తి చేశారు. ఆంధ్రా రంజీ జట్టులో ప్రాతినిధ్యం వహించి 3,050 పరుగులు చేశారు. ఇందులో ఆరు సెంచరీలున్నాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా గతంలో పనిచేశారు. అలాగే ఆంధ్రా సీనియర్ క్రికెట్ జట్టు ట్రైనర్‌గా అనంతపురం జిల్లాకు చెందిన బొమ్మన్నను నియమించారు.

'జగనన్న విద్యా దీవెన'కు ఉమ్మడి ఖాతా తెరవండి

అనంతపురం సిటీ: జగనన్న విద్యా దీవెన నాల్గో విడత పథకం లబ్ధి కోసం విద్యార్థి, తల్లి పేరుతో జాయింట్ ఖాతా తప్పనిసరిగా తెరవాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి(డీఎల్‌డీఓ) చిలంకూరు ఓబుళమ్మ తెలిపారు. శనివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. ఈ నెల 28న జగనన్న విద్యా దీవెన నాల్గో విడత నిధులు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. విద్యార్థి, తల్లి పేరుతో ఉమ్మడి బ్యాంక్ ఖాతా ఉంటేనే జగనన్న విద్యా దీవెన నాల్గో విడత లబ్ధి చేకూరుతుందన్నారు. ఎస్సీ విద్యార్థులకు జాయింట్ ఖాతా అవసరం లేదన్నారు. అలాగే 2022–23 చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులకూ ఉమ్మడి ఖాతా అవసరం లేదన్నారు.

జింకను తప్పించబోయి గాయపడ్డ ముగ్గురు

శెట్టూరు: రోడ్డుపై అడ్డంగా వచ్చిన జింకను తప్పించబోయి ద్విచక్ర వాహనంపై వెళుతున్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... శెట్టూరు మండలం బసంపల్లికి చెందిన దంపతులు మధు, అనీలమ్మ, కుమార్తె చిన్నారి కృతికతో కలసి శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై కళ్యాణదుర్గానికి బయలుదేరారు. శెట్టూరు దాటి అటవీ ప్రాంతంలోకి ప్రవేశించగానే రోడ్డుకు అడ్డంగా ఉన్నఫళంగా ఓ జింక దూసుకొచ్చింది. దానిని తప్పించేందుకు ప్రయత్నించడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ముగ్గురూ కిందపడ్డారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన మధు, అనీలమ్మ, కృతికను అటుగా వెళుతున్న వారు గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరిపై పీడీ యాక్ట్

- కడప సెంట్రల్ జైలుకు తరలింపు



నిందితులు సుధాకర్, నక్కా ఆంజనేయులు

అనంతపురం క్రైం: కలెక్టర్ గౌతమి ఉత్తర్వుల మేరకు ఎస్పీకేకేఎన్ అన్బురాజన్ ఆదేశాలతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అదనపు ఎస్పీ జి.రామకృష్ణ, గుంతకల్లు డీఎస్పీ యు.నరసింగప్పలు కరడుగట్టిన, నేర చరిత కలిగిన సుధాకర్, నక్కా ఆంజనేయులు అనే ఇద్దరు నిందితులపై పీడీ యాక్ట్ –1986 ప్రయోగించి జైలుకు పంపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శనివారం మీడియాకు వెల్లడించారు. నేర ప్రవృత్తి కొనసాగిస్తున్నా పోతే చట్టం చూస్తూ ఊరుకోదని, కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

ఆ ఇద్దరి నేర చరిత ఇదీ..

- గుంతకల్లుకు చెందిన సుధాకర్‌పై 22 కేసులున్నాయి. గతంలో గుంతకల్లు రూరల్ పోలీసు స్టేషన్‌లో 13, టూటౌన్ పోలీసు స్టేషన్‌లో 2, గుత్తి స్టేషన్‌లో 2, గుంతకల్లు ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఒకటి, అనంతపురం త్రీటౌన్, ఫోర్త్ టౌన్, విడపనకల్లు, డి.హీరేహాళ్ పోలీసు స్టేషన్‌లో ఒక్కొక్కటి చొప్పున కేసులు నమోదయ్యాయి. ఇతని నుంచి 2,449 క్వింటాళ్ల ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని, 7 లారీలు, 4 ఐచర్ వాహనాలు, 6 బొలెరోలు, 11 ఆటోలతో పాటు 45–విస్కీ, 90 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి, ఇతర రాష్ట్రాలకు రవాణా చేసి విక్రయించడం ద్వారా ప్రజా ఆహార భద్రత, శాంతి భద్రతకు ముప్పు వాటిల్లడంతో సుధాకర్‌పై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించారు.
- నక్కా ఆంజనేయులుపై గుత్తి పోలీసు స్టేషన్‌లో ఒకటి, గుత్తి సెబ్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. ఇతని నుంచి 31 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు సాగించి ప్రజారోగ్యం, శాంతి భద్రతలకు ముప్పు వాటిల్లేలా ప్రవర్తిస్తున్నందున ఆంజనేయులుపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేసి కడప జైలుకు తరలించారు.

గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించండి

- జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్



పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ కేతన్‌గార్గ్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమాదేవి, మేయర్ వసీం తదితరులు

అనంతపురం అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎంఉమాదేవి, మేయర్ వసీంతో కలసి ఆయన విడుదల చేసి, మాట్లాడారు. విజ్ఞాన భాండాగారమైన గ్రంథాలయ సేవలను అందరూ వినియోగించుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, డిప్యూటీ గ్రంథాలయ అధికారి సుబ్బరత్నం, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ(ఏ) పరిశీలన

అనంతపురం అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటుకు జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాలను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ శనివారం పరిశీలించారు. కౌంటింగ్ నిర్వహణపై చేపట్టనున్న చర్యలను ఈ సందర్భంగా ఆయనకు డీఆర్‌ఓ గాయత్రీదేవి వివరించారు. జేసీ మాట్లాడుతూ... ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు, రిసెప్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపునకు అవసరమైన గదులు, సౌకర్యాలపై నివేదిక సిద్ధం చేసి ఎన్నికల కమిషన్‌కు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, తహసీల్దార్లు బాలకిషన్, మునివేళు, హరికుమార్, విజయలక్ష్మి, సర్వేయర్ ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం డంప్ స్వాధీనం

గుంతకల్లు రూరల్: అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్‌ఐ సురేష్ వెల్లడించారు. అందిన సమాచారం మేరకు గుంతకల్లు శివారులోని దోనిముక్కల రోడ్డు సమీపంలో ఉన్న ఆర్టీటీ గృహ సముదాయంలో శనివారం సాయంత్రం సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మల్లికార్జున అనే వ్యక్తి తన ఇంట్లో 39 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్లుగా గుర్తించి, మల్లికార్జునను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కళ్యాణదుర్గం: స్థానిక బళ్లారి మిట్టపై బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శనివారం కళ్యాణదుర్గం పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిబ్బందితో కలసి ఎస్‌ఐ యువరాజ్ వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఏపీ39 టీక్యూ 3118 నంబర్ గల బొలెరో వాహనంలో 50 బస్తాల్లో 27.70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కణేకల్లు ప్రాంతం నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కర్ణాటకకు తరలిస్తున్నట్లుగా విచారణలో వెల్లడైంది.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి పట్టణ పరిధిలోని నందలపాడుకు చెందిన చిన్న ఓబులేసు(30) బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన ఓబులేసు శుక్రవారం రాత్రి 8.30 గంటలకు మద్యం కొనుగోలుకు డబ్బు ఇవ్వాలంటూ భార్య ఉమాదేవితో గొడవ పడ్డాడు. మద్యం కొనుగోలుకు తాను ఎలాంటి పరిస్థితిలోనూ డబ్బు ఇవ్వనని ఆమె తేల్చి చెప్పడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన ఓ మద్యం బాటిల్ తెచ్చుకుని అందులో విషపూరిత ద్రావకం కలుపుకుని తాగాడు. ఆలస్యంగా ఈ విషయం తెలుసుకున్న భార్య ఉమాదేవి వెంటనే చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లింది. చికిత్సకు స్పందించక శుక్రవారం అర్ధరాత్రి ఆయన మృతి చెందాడు. ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

చిరుత దాడి... జీవాల మృతి

కళ్యాణదుర్గం రూరల్: చిరుత దాడిలో మూడు జీవాలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం కామక్కపల్లికి చెందిన ప్రసాద్ గొర్రెలు, మేకల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం మేపు నుంచి జీవాలను తోలుకువచ్చి ఇంటి ఎదురుగా ఉన్న దొడ్డిలో వదిలాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ చిరుత మందలోకి చొరబడి మూడు మేకపోతులను హతమార్చింది. శనివారం ఉదయం మంద వద్దకెళ్లిన సమయంలో మేకపోతుల కళేబరాలను చూసి, చిరుత దాడి చేసినట్లుగా కాపరి ప్రసాద్ నిర్ధారించుకున్నాడు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనతో దాదాపు రూ.45 వేలు నష్టపోయినట్లు బాధిత కాపరి వాపోయాడు.

క్లుప్తంగా

బాలపోతన్నకు ఎమ్మెల్యే పరామర్శ



బాలపోతన్నను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరం, నువ్వు అధైపడొద్దు.. అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు బాలపోతన్నకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బాలపోతన్న తండ్రి నారాయణప్ప శుక్రవారం మృతిచెందారు. శనివారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండలంలోని సిద్దరాంపురానికి వెళ్లి బాలపోతన్న కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీపీ హేమలత, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, అతిక్‌రెడ్డి, అంజినప్ప, బాషా, శ్రీరామ్, ఓబీ టైలర్ వెంకటేష్, నాగరాజు, సంజన్న, బాబయ్య, సురేష్, రాజశేఖర్, ఆంజనేయులు, సర్పంచ్ ఎర్రిస్వామి, మాజీ సర్పంచ్ వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



రాప్తాడులో పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాప్తాడు: ఈనెల 14 నుంచి 20వతేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి వీరానారాయణ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వైఎస్సార్ సీపీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞాన సముపార్జన చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం




మాట్లాడుతున్న హరినాథ్ రెడ్డి

రాప్తాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని 2024లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ హరినాథ్ రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఎన్నికల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్లు, బీఎల్ఏలతో సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2024లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధి, అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ వివరించి, ఎమ్మెల్యేగా గెలుపునకు కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో 50 వేల మెజార్టీ వచ్చేలా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బూత్ కన్వీనర్లు బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బాలల దినోత్సవం

అనంతపురం కల్చరల్: స్థానిక ఎస్ఎస్ ప్యారడైజ్ కళా ప్రాంగణంలో ప్రముఖ టీవీ, సినీ యాంకర్ రమేష్ నీల్ ఆధ్వర్యంలో శనివారం ముందస్తుగా బాలల దినోత్సవం జరిపారు. సాంప్రదాయ నృత్యాలు, జానపదాలు, సింగింగ్, డ్రాయింగ్, కర్రసాము పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర రెడ్డి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మీ, ఆచార్య సుధాకరబాబు, సాయిట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్, ఎల్కేపీ కార్యదర్శి పద్మజ తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై చిన్నారులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో యోగా గురువు మహేష్‌బాబు, నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్, కత్తివిజయ్‌కుమార్, వన్నూర్ మాస్టర్, హరిప్రసాద్, నాగినీ ప్రసాద్, శ్రీదేవి పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి కియా కార్లు



కారును మార్కెట్లోకి విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: నగరంలో జాతీయ రహదారిలోని ఎంజీ బ్రదర్స్ కియా షోరూంలో శనివారం కేరెన్స్ ఎక్స్–లైన్ మ్యాటీ గ్రాఫైట్, సెల్టోస్ ఎస్–ట్రిమ్ మోడల్ కార్లను మార్కెట్‌లోకి విడుదల చేశారు. కార్యక్రమంలో షోరూం జీఎం ఎల్లప్ప, జనరల్ మేనేజర్ గిరిప్రసాద్, సేల్స్ మేనేజర్ నేమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

నీటిమాలిన రాతలు





తోపుదుర్తి గ్రామంలో వాటర్ ప్లాంట్ దగ్గర నీరు పట్టుకుంటున్న మహిళ , సింగంపల్లి తండాలో కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న మహిళ



తోపుదుర్తిలో ఉన్న వాటర్ ప్లాంట్ మిషనరీ

- అవగాహన లేకుండా ఈనాడు పిచ్చిరాతలు
- గ్రామాల్లో తాగునీరు లేదని అసత్య ప్రచారం
- మండిపడుతున్న ప్రజలు

ఆత్మకూరు: ఈనాడు పత్రికలో వాస్తవాలు వక్రీకరించి రాస్తున్నారని, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కళ్లకు కనిపిస్తుంటే.. నీటిపై రాతల్లా వాస్తవాలు కప్పిపుచ్చి రాస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, ప్రజలు మండిపడ్డారు. శనివారం ఈనాడు పత్రికలో రాప్తాడు నియోజకవర్గంలో నీటిశుద్ధి కేంద్రాలు మూసేశారని, ఎమ్మెల్యే సొంత గ్రామమైన తోపుదుర్తిలోనూ వాటర్‌ప్లాంట్ మూతపడిందని ఫొటో కథనం ప్రచురించారు. దీనిపై తోపుదుర్తి ఎంపీటీసీ పోతులయ్య, సర్పంచు ఓబులేసు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు ఈనాడు అసత్య కథనాన్ని ఖండించారు.

తోపుదుర్తిలో ఇదీ వాస్తవం..

మండలంలోని తోపుదుర్తి గ్రామంలో నీటిశుద్ధి కేంద్రం మూతపడిందని రాశారు. వాస్తవానికి 2016లో ప్రభుత్వ స్థలంలో రిట్స్ సంస్థ ఆధ్వర్యంలో శుద్ధజల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో కేవలం టీడీపీ కార్యకర్తలకే మాత్రమే గ్రామంలో నీరు అందించేవారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొందరు టీడీపీకి చెందిన వారే వాటర్‌ప్లాంట్ పరికరాలు తీసుకెళ్లారు. గ్రామంలో వాటర్ ప్లాంట్ లేకపోవడంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తండ్రి తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి తన సొంత స్థలం రెండు సెంట్లు పంచాయితీకి కేటాయించారు. ఆ స్థలంలో ఆర్డీటీ సహకారంతో రూ.12 లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. దీంతో పంచాయతీ ఆధ్వర్యంలో అప్పటి నుంచి సమస్య లేకుండా ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. మూడేళ్లలో మిషనరీ రెండుసార్లు మరమ్మతుకు గురైతే రూ.2లక్షల వరకు ఎమ్మెల్యే సొంత డబ్బు వెచ్చించి మరమ్మతు చేయించారు. ఎక్కడా లేని విధంగా తోపుదుర్తిలో ఒక క్యాన్ రూ.3లు, ఒక బిందె రూ.2లకు పార్టీలకతీతంగా ప్రజలందరికీ పంచాయతీ ద్వారా నీరు అందిస్తున్నారు.

ఎక్కడా నీటి సమస్య లేదు..

నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడా నీటి సమస్య లేకుండా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని పనులు చేయిస్తున్నారు. నియోజకవర్గంలో 92 గ్రామాలు ఉండగా, ఇప్పటికే 50 గ్రామాల్లో 6 వేల కనెక్షన్లకు పైగా జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయించారు. ఇంకా చాలా గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా పనులు జరుగుతూనే ఉన్నాయి. గ్రామాల్లో ఎక్కడ నీటి సమస్య ఉందో తెలుసుకొని పంచాయతీల ద్వారాగానీ లేదా ఎమ్మెల్యే సొంత నిధులతోగానీ బోరుబావులు తవ్వించి, నీటి సమస్య తీరుస్తున్నారు. ఇలా అభివృద్ధి జరుగుతున్నా పచ్చమీడియాలో ఇవేమీ పట్టించుకోకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా పిచ్చిరాతలు రాస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు మండిపడ్డారు.

సునీతమ్మా.. మీ హయాంలోనే మూతపడ్డాయి

రాప్తాడు: మండలంలో టీడీపీ ప్రభుత్వంలో స్వచ్ఛంద సంస్థలు, కెనరా బ్యాంకుల సహకారంతో ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా 20 లీటర్ల నీరు రూ.2 కే అందిస్తామంటూ వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అయితే వాటర్‌ప్లాంట్ల కరెంటు బిల్లు కట్టకుండా వదిలేశారు. దీంతో నియోజకవర్గంలో పదుల సంఖ్యలో పరిటాల రవీంద్ర ట్రస్ట్ ద్వారా నిర్వహించిన వాటర్ ప్లాంట్లు మూలనపడ్డాయి. ఇందుకు ఉదాహరణే మండలంలోని మరూరులో మూతపడిన వాటర్ ప్లాంటు.

మండలంలోని మరూరులో 2014లో సమగ్ర వాటర్ షెడ్ పథకం, పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ద్వారా వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి, 20 లీటర్ల నీరు రూ. 2లతో కొన్నాళ్లపాటు అందించారు. కరెంటు బిల్లు అధికంగా వస్తోందని, గిట్టుబాటు కాలేదని 20 లీటర్ల నీరు రూ.5కి పెంచారు. అప్పటికీ నష్టం వస్తోందని కరెంటు బిల్లు కట్టకుండా వదిలేశారు. కరెంటు బిల్లు ఏకంగా రూ.1.94 లక్షలకు చేరింది. నిర్వాహకులు భారమై వాటర్‌ప్లాంటు మూసివేశారు. టీడీపీ నాయకులు అధిక బిల్లు బకాయి పెట్టడంతోనే వాటర్‌ప్లాంటు మూతపడింది.

అభివృద్ధికి అడ్డు తగులుతున్న సర్పంచు



గొందిరెడ్డిపల్లి సర్పంచు (టీడీపీ మద్దతుదారు మిడతల శీనయ్య) పంచాయతీ అభివృద్ధికి అడ్డుపడుతున్నాడు.పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ద్వారా వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేసి టీడీపీ నాయకులు సొమ్ము చేసుకున్నారు. కరెంట్ బిల్లు మాత్రం కట్టలేదు. మా ప్రభుత్వం రాగానే బకాయి చెల్లించి, వాటర్‌ప్లాంటుద్వారా నీరందిస్తున్నాం. లోఓల్టేజీ సమస్యతో వాటర్‌ప్లాంటు సక్రమంగా నడవలేదు. వాటర్ ప్లాంటుకు విద్యుత్ కనెక్షన్ కోసం అధికారులు అనుమతి ఇచ్చినా, సర్పంచు అడ్డుపడుతున్నాడు. సచివాలయంలోకి సామాన్లు మార్చేందుకు ప్రయత్నించినా తలుపులు తెరవడంలేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే వాటర్‌ప్లాంటు ద్వారా పూర్తి స్థాయిలో నీరు అందిస్తాం.

– చిన్న ఓబిరెడ్డి, వార్డు మెంబర్

మంత్రి పెద్దిరెడ్డికి తేనీటి విందు



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఇంట్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు

అనంతపురం కార్పొరేషన్: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తేనీటి విందు ఇచ్చారు. శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నగరంలోని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నివాసానికి వెళ్లారు. ఎమ్మెల్యే 'అనంత' మంత్రికి స్వాగతం పలికారు.కార్యక్రమంలో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, టీటీడీ బోర్డు సభ్యులు అశ్వర్థనాయక్, నాయకులు చింతా సోమశేఖర్ రెడ్డి, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, మహానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక



ఎమ్మెల్యే అనంత సమక్షంలో పార్టీలోకి చేరిన యువత

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు అందుతున్న సంక్షేమం, నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి యువత ఆకర్షితులయ్యారు. శనివారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నివాసం వద్ద ఎమ్మెల్యే సమక్షంలో 12వ డివిజన్‌కు చెందిన యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. గౌస్‌పీర్, జోహార్, అబిద్, సిరాజ్, మౌలానా, అఫ్రిద్, జాఫర్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ హుస్సేన్, కార్పొరేటర్ సంపంగి రామాంజనేయులు, నాయకులు సుల్తాన్ ఆదాం, తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ అడుగుజాడల్లో నడుద్దాం



జేఎన్‌టీయూఏలో ఆజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రెక్టార్, రిజిస్ట్రార్



సెంట్రల్ లైబ్రరీలో నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ

అనంతపురం: భారత తొలి విద్యాశాఖ మంత్రి, దార్శనికుడు అబుల్ కలాం ఆజాద్ అడుగుజాడల్లో నడుద్దామని జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్ అన్నారు. జేఎన్‌టీయూ, అనంతపురంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. రెక్టార్ మాట్లాడుతూ భారత ప్రభుత్వంలో 11 ఏళ్ల విద్యాశాఖ మంత్రిగా పనిచేసి, అనేక సంస్కరణలు తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, డాక్టర్ డి.విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఓటీపీఆర్ఐలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రామచంద్ర హాజరయ్యారు.

సెంట్రల్ లైబ్రరీలో : నగరంలోని సెంట్రల్ లైబ్రరీలో డాక్టర్ అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం. ఉమామోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎల్ఎం మోహన్ రెడ్డి, ఉపగ్రంథాలయ అధికారి వి.సుబ్బరత్నమ్మ, శివశంకర ప్రసాద్, ఇంతియాజ్ అహమ్మద్, బాషా, కావేరి, ఉజినేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ సేవలు మరువలేనివి

- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



ఆజాద్ జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: దేశానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు మరువలేనివని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ కొనియాడారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని పోలీసు కాన్ఫరెన్స్ హాలు ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమర యోధుడిగా, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖమంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు అందించారన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఆయన ఎన్నో విద్యాలయాలు తీసుకొచ్చి దేశంలో విద్యా రంగం అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆ మహనీయుడి పేరిట పలు విద్యాసంస్థలు కూడా ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, పలువురు సివిల్, ఏఆర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల వారికీ న్యాయం



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న నాయకులు

అనంతపురం రూరల్: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అన్ని వర్గాల వారికీ న్యాయం జరుగుతోందని జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఎ.నారాయణపురం పంచాయతీ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఒకటో సచివాలయం పరిధిలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నేతలతో కలిసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు హుస్సేన్, యువజన విభాగం అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. రాజకీయాలకతీతంగా రాష్ట్రంలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలను అందజేస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎ.నారాయణపురం పరిధిలో రూ. 30 కోట్లతో రోడ్లు, కాలువలు, భవనాలు, కల్వర్టులు నిర్మించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమ్మడి జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీటీసీలు హజీవలి, నాగేంద్ర శ్రుతి, మండల ఈవోఆర్డీ దామోదర్ రెడ్డి, ఎంఎల్ఓ దామోదర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్ బాబు, తపోవనం మదన్ మోహన్‌రెడ్డి , సత్యన్న, ఉమ్మడి మనోజ్ కుమార్ రెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, బషీర్, రామలింగయ్య, నాగార్జున పుల్లారెడ్డి, రంగయ్య, అనిత పాల్గొన్నారు.

ఆ కుటుంబానికి 'అమ్మ' జీవనాధారం



వెంకటేష్ కుటుంబానికి సాయం చేస్తున్న 'అమ్మ' సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలోని కోవూరు నగర్‌కుచెందిన వెంకటేష్ యాదవ్ కుటుంబానికి 'అమ్మ' సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి రూ. 90 వేలు సాయమందించారు. వెంకటేష్ యాదవ్, నారాయణమ్మ దంపతులు రోజువారి కూలికెళ్లి కుటుంబాన్ని పోషించుకునేవారు. అనారోగ్యంతో కుటుంబ పెద్ద మంచానికే పరిమితమయ్యారు. నారాయణమ్మ జొన్నరొట్టెలు అమ్ముతూ వచ్చిన అరకొర సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకొచ్చేది. ఈ తరుణంలో ఆమె కూడా అనారోగ్యానికి గురైంది. కుటుంబ బాధ్యతలు మోసే తల్లిదండ్రులు ఇద్దరూ నిస్సహాయ స్థితిలో ఉండగా, డిగ్రీ చదువుతున్న వారి కుమార్తె గౌతమి అర్ధంతరంగా చదువు ఆపేయాల్సి వచ్చింది. గతంలోనూ వాళ్ల కుటుంబానికి అండగా నిలిచిన తరిమెల రమణారెడ్డి.. శనివారం మరోసారి రూ.90 వేలు సాయం అందించి, దీపావళి పండుగకు నిరుపేద కుటుంబంలో వెలుగులు తెచ్చారు. గౌతమి చదువుకు రూ. 35 వేలు, కూరగాయల బండికి రూ.15 వేలు, పెట్టుబడికి మరో రూ.15 వేలు, రూ. 25 వేల విలువజేసే నిత్యావసరాలు అందించారు.

టపాసుల దుకాణాల తనిఖీ

అనంతపురం క్రైం: జిల్లాలోని పలు టపాసుల విక్రయ దుకాణాలను పోలీసులు శనివారం తనిఖీ చేశారు. నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహిస్తున్నారా? లేదా, బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచారా? అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకున్న ముందస్తు జాగ్రత్తలను పరిశీలించారు. ఇదే సందర్భంగా తూనికలు కొలతల శాఖాధికారులు కూడా టపాసుల విక్రయ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టి 11 కేసులు నమోదు చేశారు. ఐదు కేసుల్లో విక్రయదారులకు రూ.15 వేలు చొప్పున జరిమానా విధించారు.



బాధ్యతగా పనిచేసినప్పుడే వృత్తికి న్యాయం



స్పెషల్ పీపీ నాగరాజు బాబు, గుత్తి కోర్టు కానిస్టేబుల్ రామకృష్ణను సన్మానిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం: ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వర్తించినప్పుడే వృత్తికి న్యాయం జరుగుతుందని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం కేసులో గుత్తి మండలం జక్కలచెరువుకు చెందిన రాముల చరణ్‌రాజుకు అనంతపురం పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి జీవితఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ. 5 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన స్పెషల్ పీపీ నాగరాజు బాబు, గుత్తి కోర్టు కానిస్టేబుల్ రామకృష్ణను ఎస్పీ అన్బురాజన్ శనివారం తన చాంబర్‌లో సన్మానించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ విశ్వనాథచౌదరి, లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

అనంతపురం కార్పొరేషన్: మాజీ సీఎం చంద్రబాబు రాయలసీమ ద్రోహి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లాకు విభజన చట్టంలో కేటాయించిన ఎయిమ్స్ ఆస్పత్రిని తరలించి, జిల్లాకు తీరని మోసం చేశారన్నారు. రాయలసీమలోని అన్ని చెరువులకు నీరు నింపాలన్న ప్రాజెక్ట్ విషయంలో టీడీపీ కోర్టుకెళ్లి అడుగడుగునా అడ్డు తగులుతోందన్నారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వండి

ఆత్మకూరు: గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు తిరుగుతున్నా, కొత్తవ్యక్తులు కనిపించినా వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ జనార్దన్ గ్రామస్తులకు తెలియజేశారు. శనివారం మండలంలోని వడ్డుపల్లి, మదిగుబ్బ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనలు పాటించాలని, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా ఎలాంటి వారిపై అయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదాలు, గొడవలు జరిగినా వెంటనే పోలీసులకు గాని లేదా 100 డయల్ చేయాలని తెలిపారు.

చంద్రమోహన్‌కు కొవ్వొత్తులతో నివాళి

అనంతపురం కల్చరల్: తెలుగు చిత్రసీమకు నటులు చంద్రమోహన్ ఎనలేని పేరు ప్రఖ్యాతలు తెచ్చారని కళాకారులు అన్నారు. ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్ వద్ద సినీ నటుడు చంద్రమోహన్ మృతిని నివాళులంచారు. కళాకారులు కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. సంస్థ ప్రతినిధులు సురేష్, శ్రీరాములు మాట్లాడారు. కార్యక్రమంలో ఆదినారాయణ, శేషాద్రి, శ్రీనివాసులు, వలి, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

నేడు కేదారేశ్వర నోములు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో శనిత్రయోదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. శనేశ్వరుడికి తైలాభిషేకాలు, నవగ్రహ స్తోత్ర పారాయణం, పుష్పాలంకార సేవలు జరిగాయి. దీపావళి సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8 గంటల వరకు కేదారేశ్వరనోములు నోస్తారని ప్రధాన అర్చకుడు నరసింహశాస్త్రి తెలిపారు. శనివారం బెంగళూరు రోడ్డు సమీపంలోని శివబాలయోగి ఆశ్రమంలో అరవింద్, దేవరాజ్ నేతృత్వంలో ధనత్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకార సేవలు నిర్వహించారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు 'అనంత' క్రీడాకారులు

విశాఖ స్పోర్ట్స్: జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు బాల ప్రణయ్, అపర్ణ, మురారి, నక్షత ఎంపికయ్యారు. అండర్ 14 బాల బాలికల రెండింటా అనంతపురం క్రీడాకారులు, అండర్ 17లో విశాఖ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో అండర్ 14, 17 బాలబాలికల విభాగాల్లో ఎంపిక పోటీలను విశాఖ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీలోని 13 ఉమ్మడి జిల్లాల జట్లు ఈ సెలక్షన్స్‌లో పాల్గొన్నాయి. టీమ్‌లో సింగిల్స్, రివర్స్ సింగిల్స్‌తో పాటు డబుల్స్ పోటీలు జరగ్గా, వ్యక్తిగత విభాగం సింగిల్స్‌లో సత్తాచాటిన ఐదుగురి చొప్పున రాష్ట్ర ఎస్‌జీఎఫ్ జట్టుకు ఎంపిక చేశారు. అండర్ 14 బాలుర విభాగంలో ఎస్.మురారి వెంకట్ (అనంతపురం), ఎం.కృష్ణకార్తీక్ (తూర్పు గోదావరి), జి.సాయివేదవ్యాస్ (చిత్తూరు), కే.ఈశ్వర్ సాయి(అనంతపురం), ఎస్.హేమంత్‌శ్రీ (పశ్చిమగోదావరి)ఎంపిక కాగా నానిబాబు, యజ్ఞదత్, సుహాస్ స్టాండ్‌బైగా నిలిచారు. బాలికల్లో జె.నక్షత్ర (అనంతపురం), ఆర్ యశ్వతసాయి (కృష్ణ), డీవీ యజ్ఞశ్రీ (అనంతపురం), డి.ఆశాశ్రీ (ప్రకాశం), సీహెచ్ మోక్షజ్ఞ (శ్రీకాకుళం) ఎంపికయ్యారు. మనోజ్ఞ, బృందవాణి, శేష్మక స్టాండ్‌బైగా నిలిచారు.



వంచకుడై ధనము సంపాదించిన వానికంటె,
యథార్థముగా ప్రవర్తించు దరిద్రుడు వాసి.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.చతుర్దశి ప.1.47 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** స్వాతి రా.3.01 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** ఉ.7.35 నుండి 9.16 వరకు, **దుర్ముహూర్తం:** సా.3.52 నుండి 4.35 వరకు, **అమృతఘడియలు:** సా.5.43 నుండి 6.54 వరకు, నరకచతుర్దశి, దీపావళి పండగ.

సూర్యోదయం : 6.06
సూర్యాస్తమయం : 5.22
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

సచిన్ పైలట్ (కాంగ్రెస్ లీడర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

రాజస్థాన్‌లో గత 25 ఏళ్లలో వరుసగా రెండోసారి బీజేపీ గెలవకపోబట్టి సరిపోయింది. లేకుంటే పాతికేళ్ల పాటు అశోక్ గెహ్లోతే కాంగ్రెస్ సీఎంగా ఉండిపోయేవారు. ఇప్పడీ ఎన్నికలను కూడా కలుపుకొంటే ఈ 72 ఏళ్ల వయసులో సీఎంగా ఆయన తన 26వ ఏట లోకి ప్రవేశిస్తూ ఉండేవారు!

ఇరవై ఏళ్లకు మించి పార్టీ అధ్యక్షురాలిగా కొనసాగడానికి సోనియాజీ అయినా కాస్త మొహమాట పడ్డారు కానీ, 25 ఏళ్లుగా – పదవిలో ఉన్నా, లేకున్నా – సీఎం సీటును అంటిపెట్టుకునే ఉన్న గెహ్లోత్‌కి చిన్న ఫీలింగ్ కూడా ఏమీ ఉన్నట్లు లేదు! 'మళ్లీ నేనే సీఎం' అంటున్నారు.

అసలు మొట్టమొదట తన 47 ఏళ్ల లేబ్రాయంలో తనెలా సీఎం అయిందీ ప్రతి ఐదేళ్లకొకసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ చెబుతుంటారు గెహ్లోత్. సోనియాజీ పార్టీ అధ్యక్షురాలు అవగానే తీసుకున్న తొలి నిర్ణయం తనను సీఎం చేయడమేనట!

"అప్పుడసలు నేను సీఎం క్యాండిడేట్‌ని కూడా కాదు. అయినప్పటికీ సోనియాజీ



పట్టుబట్టి. 'నేను చేయలేను మేడమ్' అంటున్నా వినకుండా నన్ను మందలించి మరీ సీఎంని చేశారు.." అని చెప్పకోవటాన్ని ఆయన ఎంత గానో ఇష్టపడతారు.

ఇప్పుడు కొత్తగా మరొకటి మొదలు పెట్టారు. సీఎం సీటును వదిలేద్దామని తను ఎంత అనుకున్నా, సీఎం సీటు తనను ఎంతకూ వదలడం లేదట. ఇకముందు కూడా వదలదట! "అందుకే రాజస్థాన్‌లో వరుసగా రెండోసారి కాంగ్రెసను గెలిపించి ఆ చరిత్రాత్మక విజయాన్ని సోనియాజీకి గిఫ్ట్‌గా ఇస్తాను.." అని గెహ్లోత్ అంటున్నారు! ఆయనొక్కరే గెలిపిస్తారా రాజస్థాన్‌లో కాంగ్రెస్‌ని వరుసగా రెండోసారి? గెలిపించ డానికి పార్టీలో ఇంకెవరూ లేరా?!

నేనంటే పడని వాళ్లకు టికెట్ ఇచ్చి, నా వెంట ఉండే వాళ్లను పార్టీ వదిలి వెళ్లేలా చేసి.. "సచిన్‌కి, నాకు మధ్య విభేదాల్లేవ్.." అని చెప్పకుంటున్నారు గెహ్లోత్!

విభేదాలు లేకుంటే... "నేను ఇవ్వొద్దని చెప్పినా శాంతి ధరీవాల్‌కి టికెట్ ఎందుకు ఇచ్చినట్లు? విభేదాలు లేకుంటే.. జ్యోతీ ఖండేల్ వాల్‌కు, పండిట్ సురేష్ మిశ్రాకు ఎందుకు టికెట్ ఇవ్వనట్లు?

టికెట్ ఇవ్వలేదని జ్యోతి, మిశ్రా ఇద్దరూ బీజేపీలోకి వెళ్లిపోయారు. ముందు మిశ్రా వెళ్లిపోయారు. తర్వాత జ్యోతి వెళ్లిపోయారు. వెళ్లిపోయే ముందు మిశ్రాజీ నాతో అన్న మాట చాలా పదునుగా ఉంది.

"ఏం చెయ్యమంటారు సచిన్‌జీ? పార్టీలో మీ మాటకే విలువ లేనప్పుడు నాకు వేరే దారి ఏముంటుంది చెప్పండి?" అన్నారాయన!

అదే మాటను జ్యోతి వేరేలా అన్నారు. "పార్టీ కోసం ఎవరు ఎంత చేస్తున్నారన్నది కాంగ్రెస్‌కి లెక్క కాదు. పార్టీలో ఎవరు, ఏ లీడర్ వైపు ఉన్నారన్నది ముఖ్యం. ఆ లీడరంటే పైవారికి పడకపోతే ఇక ఆ లీడర్ వైపు ఉన్నవారికి పార్టీలో చిన్న పని కూడా దొరకదు..." అని ఆమె ఆవేదన చెందారు.

"కలిసి పని చేస్తున్నాం..." అని చెబుతూనే, గెహ్లోత్ తను చేసేది తను చేసుకుపోతున్నారు. సీఎం కుర్చీని పట్టుకుని వేళ్లాడుతూనే, కుర్చీనే తనను సీఎం అనే తాడుతో గట్టిగా కట్టేసు కుంది అని చెబుతున్నారు!

ఈ ఉదయం కొంతమంది అభ్యర్థులు నన్ను కలిసేందుకు వచ్చారు. "దీపావళి శుభాకాంక్షలు సచిన్‌జీ..." అంటూ.. "నిజమైన దీపావళి మీరు వేరే పార్టీ పెట్టినప్పడే సచిన్ జీ..." అన్నారు! నన్నెంతగానో అభిమానించే నా అనుచరులు వాళ్లంతా.

"ఖర్గేజీ కాదు, గెహ్లోత్ కాదు... మీరే మా నాయకుడు సచిన్‌జీ..." అని కూడా వారు అన్నారు!! వారికి నాపై అంత అభిమానం ఉన్నప్పుడు... నాలో కొంచెమైనా ఆత్మాభిమానం లేకుపోతుందా?


నవ్వాను. ఆలింగనం చేసుకున్నాను. "దీపావళి శుభాకాంక్షలు ఆత్మీయులారా..." అని చెప్పాను.

పల్లవి... కాంగ్రెస్, చరణం... చంద్రబాబు!

జనతంత్రం



వర్ధెల్లి మురళి



తెలంగాణా కాంగ్రెస్ పార్టీ స్వరం మారుతున్నది. గాత్రంలో కొత్త గమకాలు పుట్టుకొస్తున్నాయి. లక్ష్యసిద్ధి కోసం బొంత పురుగునైనా ముద్దాడాలనేది కేసీఆర్ నుడివిన సూక్తి. దాన్ని మరింత ముందుకు తీసుకొనిపోతూ భస్మాసురుడి కౌగిట్లో చేరడానికి సిద్ధపడింది... గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కూటమి కట్టి తెలుగుదేశం పార్టీ పోటీ చేసింది. కనాకష్టంగా 3 శాతం ఓట్లు సంపాదించింది. ఆ మూడు శాతం ముచ్చట కోసం కాంగ్రెస్ పార్టీ తన తెలంగాణ రిమోట్ కంట్రోల్‌ను చంద్రబాబు చేతిలో పెట్టినట్టు కనిపిస్తున్నది.

కాంగ్రెస్ గెలుపు కోసం తెలుగుదేశం పోటీ నుంచి తప్పుకున్నది. ఈ సంగతి స్వయంగా చంద్రబాబే తనకు చెప్పినట్టు అప్పటి తెలంగాణా యూనిట్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ స్పష్టంగా చెప్పారు. పైకి కనిపించే దృశ్యం ఇది. దీపం ముందు శలభంలా కాంగ్రెస్ కోసం తెలుగుదేశం ఒక సారో పాత్రలో కనిపిస్తున్నది. కానీ సారం మాత్రం అది కాదు. పోచమ్మ గుడి ముందు కట్టేసిన బలి పొట్టేలు కాంగ్రెస్ పార్టీయే! లేని విశ్వసనీయతను చంద్రబాబుకు కట్టబెట్టడం కోసం, ఆయనకు తెలంగాణలో 'హోమ్లీ ఫీలింగ్'ను కలుగజేయడం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నది. ఇందుకోసం తనను తాను హననం చేసుకోవడానికి కూడా అది వెనుకాడటం లేదు.

తెలంగాణ ఎన్నికల సందర్భాన్ని పురస్కరించుకొని 'ఇండియా టుడే' జాతీయ న్యూస్ ఛానల్ వాళ్లు హైదరాబాద్‌లో ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కూడా ఇతర పార్టీల నాయకులతోపాటు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన రెండు వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేశారు. వీటిపై తెలంగా ణాలో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. '1995లో చంద్రబాబు ప్రారంభించిన ఐటీ, ఫార్మా, ఔటర్ రింగ్ రోడ్, మెడికల్ హబ్ వంటి కార్యక్రమాలను కాంగ్రెస్ కొనసాగించింద'ని ఆయన చెప్పారు. ఇదొక చర్చనీయాంశం.

భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) పద్ధతులతో రాచకొండ ప్రాంతంలో ఒక కొత్త నగరాన్ని 50 వేల ఎకరాల్లో నిర్మించడం రెండో వివాదాస్పద వ్యాఖ్య. చంద్రబాబు విఫల ప్రయోగం అమరావతిని ఈ సమీకరణ గుర్తుకు తెస్తున్నది. ఏదో యథా లాపంగా రేవంత్ రెడ్డి నోటి వెంట ఈ మాటలు వచ్చి ఉంటా యనుకోవడానికి వీలు లేదు. ఎందుకంటే రేవంత్ రెడ్డి వైపు నుంచి ఆ తర్వాత ఎటువంటి వివరణ రాలేదు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులెవరూ ఖండించలేదు. ఒక్క రేవంత్ రెడ్డికి మాత్రమే రెండు చోట్ల, అందులో ఒకటి ముఖ్యమంత్రి స్థానంలో పోటీ చేసే అవకాశం కల్పించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి కూడా రేవంత్ వ్యాఖ్యల్లో అభ్యంతరాలు కనిపించలేదు.

ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ రంగానికి పాదు చేసిందెవరు? ఎనభయ్యో దశకం నాటి నుంచే తెలుగునాట సమాచార రంగంలో యెల్లో మీడియా గుత్తాధిపత్యాన్ని సంపాదించింది. అప్పటి నుంచి యెల్లో మీడియాకు తాను వలచింది రంభ, తాను మునిగింది గంగ! తెలుగు ప్రజలందరూ ఇటువంటి అభిప్రాయాలనే కలిగివుండి తీరాలి. వేరే మార్గం లేదు! ఆ దశలో చంద్రబాబు అనే కొయ్యగుర్రాన్ని సృష్టించి పరుగులరాణి పంచకల్యాణిగా లోకానికి పరిచయం చేశారు. 'ఐటీ రంగ సృష్టికర్త అతనే' అని డప్పు వేయించారు. ఈ డప్పుల మోత ఎంత ఉన్మాద స్థాయికి చేరిందంటే – చివరికి చంద్రబాబే అవన్నీ నమ్మి, తనను తాను ఐన్‌స్టీన్‌కు అన్నయ్యగా, న్యూటన్‌కు పాఠం చెప్పిన గురువుగా భ్రమపడేంతగా! రెండు దశాబ్దాలు దాటినా ఇప్పటికీ సెల్‌ఫోన్, కంప్యూటర్ వగైరా వగైరాలను తానే కనిపెట్టాననే అపస్మారక మాటల నుంచి ఆయన బయటపడలేక పోవడానికి యెల్లో మీడియా డప్పుల మోతే కారణం.

వాస్తవానికి హైదరాబాద్‌లో ఐటీ రంగానికి ఆద్యులెవరు? భవిష్యత్తులో ఐటీ రంగం పోషించబోయే పాత్రను అర్థం చేసుకున్న దార్శనికుడు... నాటి ప్రధాని పీవీ నరసింహారావు. 'సాఫ్ట్‌వేర్ పార్క్స్ ఆఫ్ ఇండియా' పేరుతో ఐదారు నగరాల్లో ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. సహజంగానే ఆయనకు హైదరాబాద్‌పై ఉండే మక్కువతో మొదటి పార్క్‌ను హైదరాబాద్‌కు కేటాయించారు. ఇప్పుడు 'సైబర్ టవర్స్'గా మనం పిలుచుకుంటున్న భవంతికి 1993లోనే నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి (కాంగ్రెస్) శంకుస్థాపన చేశారు. దాన్ని మరుగుపరిచి, ఆ ప్రాంతంలో తనకు కావలసిన వారు, బినామీలు భూములు కొనుగోలు చేసేంత వరకు మూడు నాలుగేళ్ల పాటు చంద్రబాబు జాగు చేశారు. ఈ ఆలస్యం కారణంగా ఐటీలో తొలిస్థానంలో ఉండవలసిన హైదరాబాద్‌ను బెంగళూరు అధిగమించింది. ఆ రకంగా హైదరాబాద్ ఐటీ రంగానికి చంద్రబాబు చేసింది ద్రోహం!

వడ్డించేవాడు మనవాడైతే కడ పంక్తిన

వాస్తవానికి హైదరాబాద్‌లో ఐటీ రంగానికి ఆద్యులెవరు? భవిష్యత్తులో ఐటీ రంగం పోషించబోయే పాత్రను అర్థం చేసుకున్న దార్శనికుడు... నాటి ప్రధాని పీవీ నరసింహారావు. 'సాఫ్ట్‌వేర్ పార్క్స్ ఆఫ్ ఇండియా' పేరుతో ఐదారు నగరాల్లో ఐటీ పార్కులను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. సహజంగానే ఆయనకు హైదరాబాద్‌పై ఉండే మక్కువతో మొదటి పార్క్‌ను హైదరాబాద్‌కు కేటాయించారు. ఇప్పుడు 'సైబర్ టవర్స్'గా మనం పిలుచుకుంటున్న భవంతికి 1993లోనే నాటి ముఖ్యమంత్రి ఎన్. జనార్దన్ రెడ్డి (కాంగ్రెస్) శంకుస్థాపన చేశారు. దాన్ని మరుగుపరిచి, ఆ ప్రాంతంలో తనకు కావలసినవారు, బినామీలు భూమలు కొనుగోలు చేసేంత వరకు మూడు నాలుగేళ్ల పాటు చంద్రబాబు జాగు చేశారు. ఈ ఆలస్యం కారణంగా ఐటీలో తొలిస్థానంలో ఉండవలసిన హైదరాబాద్‌ను బెంగళూరు అధిగమించింది. ఆ రకంగా హైదరాబాద్ ఐటీ రంగానికి చంద్రబాబు చేసింది ద్రోహం!

వడ్డించేవాడు మనవాడైతే కడ పంక్తిన కూర్చున్నా ధోకా లేదంటారు. వర్తమాన చరిత్రను రికార్డు చేసే వార్తాపత్రికలకు చంద్రబాబు కావల్సినవాడయ్యారు. కనుక ఐటీని కనిపెట్టినవాడనే భుజకీర్తులను ఆయనకు తగిలించారు. 'కామమ్మ మొగుడంటే కామోసు' అనుకున్నట్టు ఆయన నిజంగానే తాను ఐటీ ఫౌండర్‌నని నమ్మడం మొదలుపెట్టారు.

కూర్చున్నా ధోకా లేదంటారు. వర్తమాన చరిత్రను రికార్డు చేసే వార్తాపత్రికలకు చంద్రబాబు కావల్సినవాడయ్యారు. కనుక ఐటీని కనిపెట్టినవాడనే భుజకీర్తులను ఆయనకు తగిలించారు. 'కామమ్మ మొగుడంటే కామోసు' అనుకున్నట్టు ఆయన నిజంగానే తాను ఐటీ ఫౌండర్‌నని నమ్మడం మొదలుపెట్టారు. కానీ కాంగ్రెస్ పార్టీ వారైనా వాస్తవాలను వెలుగులోకి తెచ్చి ఆ క్రెడిట్‌ను తీసుకోవాలి కదా? విచిత్రంగా కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థి అయిన బీఆర్ఎస్ వాళ్లే దీన్ని గుర్తించి క్రెడిట్‌ను కాంగ్రెస్‌కు ఇస్తున్నారు. కానీ కాంగ్రెస్ వాళ్లు మాత్రం అందుకు ఒప్పుకోవడం లేదు. ఈ గజమాల చంద్రబాబు మెడలోనే ఉండాలని తెగ ఉబలాటపడుతున్నారు. దాని కొనసాగింపే నిన్నటి 'ఇండియా టుడే' సమావేశంలో రేవంత్ చెప్పిన మాటలు.

చంద్రబాబు ప్రారంభించిన ఐటీతో పాటు ఔటర్ రింగ్ రోడ్డును కూడా తాము కొనసాగించామని రేవంత్ చెప్పారు. సైబర్ టవర్స్‌కు కాంగ్రెస్ వాళ్లు శంకుస్థాపన చేస్తే, ఆలస్యం చేసైనా చంద్రబాబు నిర్మించి ప్రారంభించాడు. ఐటీ ప్రారంభంలో చంద్రబాబు పాత్ర కూడా ఉన్నదని చెబితే ఎంతో కొంత అతుకుతుంది. ఔటర్ రింగురోడ్డును బాబు తలకు ఎట్లా చుట్టేస్తారు? 2004 ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. దానిప్రకారం మియాపూర్ నుంచి శంషాబాద్ వరకు 150 అడుగుల వెడల్పుతో రోడ్డును నిర్మించాలి. మియాపూర్ నుంచి గచ్చిబౌలి వరకు అప్పటికే రోడ్డు ఉన్నది. దాన్ని కొంచెం వెడల్పు చేస్తే సరిపోతుంది. అక్కడ నుంచి శంషాబాద్ వరకు 150 అడుగుల వెడల్పుతో 27 కి.మీ. రోడ్డును కొత్తగా వేయాలి. ఇది ప్రకటన మాత్రమే! కాగితం కదిలిందీ లేదు. సర్వే జరిగిందీ లేదు. ఈ నోటిఫికేషన్ కూడా హైదరాబాద్ పడమటి ప్రాంతాన్ని మాత్రమే కవర్ చేస్తుంది.

నగరం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డును అంతర్జాతీయ స్థాయిలో నిర్మించాలనే ప్రతిపాదన వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జీవం పోసుకున్నది. 500 అడుగుల వెడల్పుతో, 175 కి.మీ. పొడవునా నిర్మించాలని సంకల్పించి, సర్వేలను ముగించి, శరవేగంగా భూసేకరణను కూడా పూర్తి చేసింది ఆయన హయాంలోనే! ఈ భూసేకరణ సమయంలోనే రాష్ట్ర ప్రభుత్వంతో రామోజీరావు కయ్యానికి దిగి, 'పెద్దలా? గద్దలా..?' పేరుతో విషప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన భూముల్లో కొద్ది భాగం రోడ్డు కోసం సేకరించవలసి వచ్చింది. దాన్ని మినహాయించాలంటే రోడ్డు వంకర తిరగాలి. సాంకేతికంగా ఇది సాధ్యమయ్యే పని కాదు గనుక ఆయన సలహాను వైఎస్సార్ ప్రభుత్వం మన్నించలేకపోయింది. దాంతో ప్రభుత్వంపై ఆయన యుద్ధాన్ని ప్రకటించారు. భూసేకరణ దశలోనే జరిగిన ఈ రభస ఇప్పటికే చాలామందికి గుర్తే!

భూసేకరణ పూర్తి చేయడమే గాక రోడ్డు నిర్మించడంలో కూడా 90 శాతాన్ని రాజశేఖరరెడ్డి పూర్తి చేశారు. ఇప్పుడున్న ప్రభుత్వం మిగతా భాగాన్ని పూర్తి చేసి సుందరీకరణ, విద్యుదీకరణ వంటి పనులను చేపట్టింది. వాస్తవాలు ఇలా వుంటే ఔటర్ రింగ్ రోడ్డులో ఎటువంటి పాత్ర లేని చంద్రబాబు ఖాతాలో దాన్ని వేయడం యెల్లో మీడియాకు, తెలుగుదేశం వీరాభిమానులకు మాత్రమే సాధ్యమయ్యే సాహసం. ఈ సాహస పోటీలో వాళ్లను తలదన్నేలా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్నది. తాము మాత్రమే సొంతం చేసుకోవాల్సిన ప్రతిష్ఠలో అర్ధ భాగాన్ని చంద్రబాబుకు సమర్పించేందుకు వారు సిద్ధపడుతున్నారు.

మహాభారతంలో ద్రోణాచార్యుడు, పాంచాల రాజైన ద్రుపదుడు బాల్యస్నేహితులు. కష్టాల్లో ఉన్న ద్రోణుడు ఒకసారి సాయం కోసం ద్రుపదుడి దగ్గరకు వెళ్లాడట. ద్రుపదుడు అవమానించి పంపాడు. ఆ కోపాన్ని చానాళ్లపాటు ద్రోణుడు కడుపులో దాచుకున్నాడు. కురు, పాండవ రాకుమారులకు విద్య నేర్పిన తర్వాత కడుపులోని అక్కసును వాళ్ల ముందు ద్రోణాచార్యుడు వెళ్లగక్కాడు. వెంటనే అర్జునుడు బయల్దేరి ద్రుపదుణ్ణి బంధించి తెచ్చి గురువు ముందు నిలబెడతాడు. ఆ విధంగా గురుదక్షిణ చెల్లిస్తాడు. చంద్రబాబు తాను వేసుకున్న విజనరీ ముసుగుకు అమరావతి రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఘోర అవమానం జరిగింది. ఆ ప్రాజెక్టు ఆచరణ సాధ్యమయ్యేది కాదన్న అభిప్రాయం రోజురోజుకూ బలపడుతున్నది. తనను నమ్మి పెట్టుబడులు పెట్టిన కస్టమర్ల నుంచి ఒత్తిడి ఎదురవుతున్నది. ఈ దశలో ప్రాజెక్టు ఆచరణ సాధ్యమేనన్న ఊరట దొరకాల్సిన అవసరం బాబుకు ఏర్పడి ఉండవచ్చు.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ద్వారా ఓ గ్రీన్ ఫీల్డ్ సిటీ ఏర్పాటును ప్రకటిస్తే చంద్రబాబుకు బోలెడంత ఊరట. తన విజన్‌ను పక్క రాష్ట్రాలు

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ద్వారా ఓ గ్రీన్ ఫీల్డ్ సిటీ ఏర్పాటును ప్రకటిస్తే చంద్రబాబుకు బోలెడంత ఊరట. తన విజన్‌ను పక్క రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని చెప్పకోవచ్చు. కేవలం ప్రకటన చాలు. ఆ తర్వాత కొంచెం ప్రచారం చాలు. అంతకు మించి అది ముందుకు కదిలే అవకాశాలు లేవు. ఈ ప్రకటనతో లాభపడే మొదటి వ్యక్తి రామోజీరావు. ఔటర్ రింగ్ రోడ్డుకూ, రాచకొండ గుట్టలకు మధ్యన రామోజీ ఫిలిం సిటీ ఉంటుంది. పక్కనే రాచకొండ నగరం ప్రచారంతో తన ఫిలిం సిటీ భూముల విలువ పెరుగుతోంది. ఒకప్పుడు లక్ష నాగళ్లతో ఫిలిం సిటీని దున్నేయాలన్న నినాదాల బదులు లక్షల కోట్ల విలువైన ల్యాండ్ బ్యాంక్‌గా అది మారుతోంది. ఆ భూముల చట్టబద్ధత, వివాదాలు వగైరా వేరే అంశం.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సారథి రేవంత్ రెడ్డికి పూర్వాశ్రమంలో చంద్రబాబు గురువు. చంద్రబాబుకు రామోజీ గురువు. రాచకొండ నగర ప్రకటన ఈ గురుపరంపర కోరిన దక్షిణ కావచ్చు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానానికీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలకూ ఎందుకు పట్టడం లేదు? ఎవరి అవసరాలు వారివి!

కూడా అనుసరిస్తున్నాయని చెప్పకోవచ్చు. కేవలం ప్రకటన చాలు. ఆ తర్వాత కొంచెం ప్రచారం చాలు. అంతకు మించి అది ముందుకు కదిలే అవకాశాలు లేవు. ఈ ప్రకటనతో లాభపడే మొదటి వ్యక్తి రామోజీరావు. ఔటర్ రింగ్ రోడ్డుకూ, రాచకొండ గుట్టలకూ మధ్యన ఫిలిం సిటీ ఉంటుంది. పక్కనే రాచకొండ నగరం ప్రచారంతో తన ఫిలిం సిటీ భూముల విలువ పెరుగుతోంది. ఒకప్పుడు లక్ష నాగళ్లతో ఫిలిం సిటీని దున్నేయాలన్న నినాదాల బదులు లక్షల కోట్ల విలువైన ల్యాండ్ బ్యాంక్‌గా అది మారుతోంది. ఆ భూముల చట్టబద్ధత, వివాదాలు వగైరా వేరే అంశం.


తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సారథికి పూర్వాశ్రమంలో చంద్రబాబు గురువు. చంద్రబాబుకు రామోజీ గురువు. రాచకొండ నగర ప్రకటన ఈ గురుపరంపర కోరిన దక్షిణ కావచ్చు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానానికీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలకూ ఎందుకు పట్టడం లేదు? ఎవరి అవసరాలు వారివి! గత సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చంద్రబాబు భారీగా ఆర్థిక సాయాన్నందించినట్టు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అంతకు ముందు జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఖర్చు బాధ్యతను ఆయన తీసుకున్నందువల్లనే పొత్తు కుదిరిందన్న విషయం కూడా విదితమే. ఇప్పుడు కూడా ఆ బాధ్యతను కర్ణాటక కాంగ్రెస్‌తో పాటు బాబు వర్గం కూడా తీసుకున్నట్టు సమాచారం.

ఇటీవల కొందరు సినీ ప్రముఖులు, వ్యాపారులు, ఇతర రంగాల వారూ సుమారు 150 మంది హైదరాబాద్‌లోని ఓ క్లబ్‌లో సమావేశమై రాజకీయ చర్చలు జరిపినట్టు సమాచారం వచ్చింది. వీరిలో కొందరు అమరావతి రియల్ ఎస్టేట్ వెంచర్‌లో భూములు కొనుగోలు చేసినవారున్నారు. ఇంకొందరు తెలుగుదేశం పార్టీతో వ్యాపార, సామాజిక సంబంధాలున్నవారు. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలనీ, అందుకు అవసరమైన 'సహకారాన్ని' అందించాలనీ కూడా వారు తీర్మానించినట్టు తెలిసింది. ఇందుకు ప్రతిఫలంగా వారు ఆశించేది కూడా వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని కొంచెం పైకి లేపే జాకీ కావాలి. అమరావతి వెంచర్‌లో చిన్నపాటి కదలికైనా రావాలి. కర్ణుడి చావుకు ఆరు కారణాలన్నట్టు రాచకొండ ప్రకటనకు కూడా ఇటువంటి అనేక కారణాలుండవచ్చు. నగర రియల్ ఎస్టేట్ అవసరాలకు అత్యంత చేరువలో ట్రిపుల్ వన్ జీవో పరిధిలో లక్ష ఎకరాలు సిద్ధమవుతున్న సమయంలో డిమాండ్‌ను మించిన సప్లై అందుబాటులోకి వచ్చింది. రాచకొండ సిటీ ఆచరణాత్మకమవుతుందని ఎవరూ భావించడం లేదు. భావించాల్సిన అవసరం కూడా లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కావలసింది అరచేతిలో వైకుంఠం చూపడమే! అమరావతిలో బాబు చూపిన వైకుంఠం వికటించింది. ఇప్పుడు కాంగ్రెస్ 'హస్తం'లో దాన్ని కొత్తగా చూపించాలి. మెడికల్ బెయిల్ మీద హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబు తక్షణ మిషన్ ఇదే! క్యాటరాక్ట్ ఆపరేషన్ కోసం నాలుగు వారాల సమయం కావాలని బాబు న్యాయవాదులు గట్టిగా వాదించి 28వ తేదీ దాకా మెడికల్ బెయిల్ తెచ్చుకున్నారు. తెలంగాణలో ఎన్నికల ప్రచార ఘట్టం ఆ రోజున పూర్తవుతుంది.

vardhelli1959@gmail.com

ఇరాక్‌తో ఒకలా! ఇజ్రాయెల్‌తో మరోలా!!

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

పాలస్తీనాలో భాగమైన గాజా రాజ్యరహిత పరిస్థితి... దాన్ని పాలిస్తున్న హమాస్‌ను తీవ్రవాదంలోకి నెట్టింది. ఇజ్రాయెల్‌లోని పాలస్తీనా బందీలను వదలమన్న ఐక్య రాజ్య సమితి 194వ తీర్మానాన్ని ఇజ్రాయెల్ ఖాతరు చేయలేదు. పైగా పాలస్తీనాను ఆక్రమించింది. తీవ్ర నిరసనలతో 2023 అక్టోబర్ ఏడున హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఇజ్రాయెల్ గాజాపై ప్రతీకార యుద్ధానికి దిగింది. ఈ చర్యను అనేక దేశాలు ఖండించాయి.

గతంలో భద్రతా మండలి 1441వ తీర్మానాన్ని 2002 నవంబర్ 8న ఏకగ్రీవంగా ఆమోదించింది. అనేక తీర్మానాల్లో నిర్ధారించినట్లు తన నిరాయుధీకరణ బాధ్యత నిర్వహణకు సద్దాం హుస్సేన్‌కు ఈ తీర్మానం తుది అవకాశాన్నిచ్చింది. 687వ తీర్మాన యుద్ధ విరమణ ఆదేశాన్ని ఇరాక్ పాటించలేదనీ, విధ్వంసక నిషిద్ధ ఆయుధాలను సంపాదించి, నిషేధిత క్షిపణులను తయారు చేసిందనీ, 1990–91లో కువైట్ ఆక్రమణలో తన సైనిక దోపిడీకి పరిహారం నిరాకరించిందనీ ఆరోపించింది. ఇరాక్ తప్పుడు వ్యాఖ్యానాలు, సమర్థనలు, ఈ తీర్మాన అమలు వైఫల్యం ఇరాక్ బాధ్యతల ఉల్లంఘన అని హెచ్చరించింది.

ఈ తీర్మానంలో ఇరాక్‌పై యుద్ధ ప్రసక్తి లేదు. ఐరాస పర్యవేక్షణ, పరిశీలన, తనిఖీ కమిషన్, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తనిఖీలను ఇరాక్ అనుమతించాలని పేర్కొన్నారు. 2002 సెప్టెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యు. బుష్ ఐరాస సాధారణ సభలో ఇరాక్ తప్పులను చదివారు. ఆ తప్పులు: ఐరాస భద్రతా సమితి 1373వ (ఉగ్రవాద నిరోధక) తీర్మానాన్ని ఇరాక్ ఉల్లంఘించింది. ఇరాన్, ఇజ్రాయెల్, పాశ్చాత్య దేశాలపై దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాద సంస్థలకు మద్దతిస్తోంది. అఫ్గానిస్తాన్ నుంచి తప్పించుకున్న అల్ ఖైదా ఉగ్రవాదులు ఇరాక్‌లో ఉన్నారు. ఐరాస మానవ హక్కుల కమిషన్ 2001లో ఇరాక్‌లో తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘనలను గమనించింది. ఇరాక్‌లో జీవ, రసాయన ఆయుధాలు, దీర్ఘ లక్ష్య క్షిపణుల తయారీ, ఉపయోగం ఐరాస తీర్మానాల అతిక్రమణ. ఐరాస పథకం ఆహారానికి చమురు డబ్బుతో ఇరాక్ ఆయుధాల కొనుగోలు.

భద్రతా మండలిలో వీటో హక్కు, శాశ్వత సభ్యత్వమున్న రష్యా, చైనా, ఫ్రాన్స్‌లకు ఇరాక్‌పై అమెరికా యుద్ధానికి దిగుతుందన్న అనుమానముంది. తీర్మానంలో తీవ్ర పరిణామాలు, పాదార్థిక ఉల్లంఘనలు వంటి పదాలు యుద్ధానికి దారితీయరాదని, ఇరాక్‌పై చర్యకు మరొక తీర్మానం అవసరమని రష్యా, ఫ్రాన్స్‌లు వాదించాయి. 1441వ తీర్మాన ముసాయిదాను తయారుచేసిన అమెరికా,



ఇంగ్లండ్‌లు, తీర్మానానికి అనుకూలంగా ఓటేసిన ఏకైక అరబ్బు దేశం సిరియా, ఈ తీర్మాన లక్ష్యం ఇరాక్ నిరాయుధీకరణని, దానికి ఇరాక్ సహకరించకపోతే భద్రతా మండలి తర్వాతి కార్యక్రమాన్ని నిర్ణయించాలని అన్నాయి. ఇరాక్ 2002 నవంబర్ పదమూడున తీర్మానాన్ని అంగీకరించింది. అమెరికా (ఐరాస) తీర్మాన ఆరోపణలు రుజువు కాలేదని ఐరాస తనిఖీ అధికారులు 2002 నవంబర్‌లో నివేదించారు. అదే ఏడాది డిసెంబర్‌లో ఇరాక్ 12 వేల పేజీల ఆయుధ నివేదికను ఇచ్చింది. ఏ ఐరాస సభ్య దేశమూ యుద్ధానికి అనుకూలం కాదు. అమెరికా, ఇంగ్లండ్‌లు చాలా తారుమారు పనులు చేశాయి. ఒకటి రెండు దేశాలు ఐరాస భద్రతా మండలిని ఆదేశించలేవని ఐరాస సభ్య దేశాలు ప్రకటించాయి. ఇరాక్‌పై యుద్ధం అసమ్మతమని న్యాయ కోవిదులు తమ అభిప్రాయాలను తెలిపారు. అయినా 2003 మార్చి 19న అమెరికా ఇరాక్‌పై యుద్ధానికి దిగింది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, పోలండ్‌లు ఇరాక్‌పై యుద్ధం చేశాయి. 2003 మే వరకు వరకు యుద్ధం సాగింది. ఇరాక్ సర్వనాశనమైంది. సద్దాం హుస్సేన్‌ను బంధించి ఉరిదీశారు. ఐరాస ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్ ఇరాక్‌పై యుద్ధం చట్టవ్యతిరేకమనీ, ఐరాస వ్యవస్థాపక ఒప్పంద ఉల్లంఘనని 2004 సెప్టెంబర్‌లో ప్రకటించారు.

యుద్ధనివారణ కోసం ఐరాస సభ్య దేశాలు ఒక దేశంపై మరొక దేశం దాడిని ఆపాలన్నది రెండవ ప్రపంచ యుద్ధ విధ్వంసం తర్వాత ఏర్పడ్డ ఐరాస ప్రధాన లక్ష్యం. ఇజ్రాయెల్ ఐరాస సభ్య దేశం. పాలస్తీనా, వాటికన్ నగరం ఐరాస పరిశీలన దేశాలు. యుద్ధ నిరోధంలో పాలస్తీనా కంటే ఇజ్రాయెల్‌పై ఎక్కువ బాధ్యత ఉంది.

అంతర్జాతీయ మానవత్వ చట్టాలను పాటించి, మానవత్వంతో గాజాలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపాలనీ, ప్రజలకు అత్యవసర ఆహార, ఔషధాలను అందించాలనీ, బందీలను వదలాలనీ ఐరాస సర్వసభ్య సాధారణ సభ 2023 అక్టోబర్ 27న తీర్మానించింది. ఈనాటికీ ఈ తీర్మానాన్ని ఇజ్రాయెల్ అమలు చేయలేదు. యుద్ధాన్ని ఆపలేదు. అమెరికా... ఇజ్రాయెల్ పక్షం వహిస్తోంది. కనీసం తాత్కాలిక విరామాన్ని పాటించమని అమెరికా మిత్ర దేశాలే కోరాయి. ఐరాస 1441వ తీర్మాన చట్టవ్యతిరేక దుర్వినియోగానికి, ఐరాస ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడ్డ అమెరికా, అలాగే ఇరాక్‌పై యుద్ధంలో పాల్గొన్న ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, పోలండ్‌లు నేటి ఐరాస తీర్మానాన్ని ఎందుకు అమలు చేయించవు? ఇరాక్‌ను కక్షతో శిక్షించిన అమెరికా మానవత్వంతో ఇజ్రాయెల్‌ను ఎందుకు దండించదు?

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 9490 20 4545

అభేదం

సహజ కవి, భక్త కవి బమ్మెర పోతన పరమ శివ భక్తుడు. అయినా మహా భాగవత రచన చేయాలనే సంకల్పంతో ఒకరోజు పవిత్ర గౌతమీ గంగలో స్నానం చేసి, ఎత్తయిన ఇసుక తిన్నె మీద మహేశ్వర ధ్యానంలో నిశ్చలంగా కూర్చున్నాడు. సీతా సమేతుడైన రామచంద్రుడు పోతన ధ్యానంలో సాక్షాత్కరించాడు. తనకు అంకితంగా మహా భాగవతాన్ని తెలుగు చేయమన్నాడు. పోతన భాగవతం రచించి 'హరికి నందగోకుల విహారికి' శ్రీకృష్ణునికి సమర్పణం చేశాడు. ఇది అత్యద్భుతం. ఆశ్చర్యకరం.




జ్యోతిర్మయం

శ్రీమన్నారాయణుని కథలు రాయాలనుకున్న పోతన తన ఇష్ట దైవం శివుని ధ్యానించాడు. శివుని ధ్యానిస్తున్న అతనికి శ్రీరాముడు ఎలా ప్రత్యక్షమయ్యాడు? శ్రీరాముడు తన కివ్వమన్న కృతిని పోతన కృష్ణునికి అంకితం చేయటం ఏమిటి? ఈ మహా మాయా నాటకమంతా శ్రీహరికి, శివునికి, రాముడికి, కృష్ణునికి అభేదం చెప్పటానికే! దేవుడు ఒక్కడే. ఆ యా రూపాలన్నీ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణలకు భగవంతుడు ఆ యా సందర్భాలలో దాల్చిన రూపాలే అని చెప్పటానికే!

ఆనాటి సమాజంలో చెలరేగిన శైవ, వైష్ణవ పరస్పర సంఘర్షణను శాంతింప చేయటానికి, సమరస భావాన్ని నెలకొల్పటానికి పోతన హరి హరాద్వైత భావనను చెప్పాడు. తిక్కన హరి హర నాథునికి తన భారతాన్ని అంకితం చేసి శివ కేశవ అభేదాన్ని చాటి చెప్పాడు. మహా కవుల చర్యలు, రచనలు సమాజ శ్రేయస్సు, లోక కల్యాణాల కోసమే!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

నివాళి



జననం: 23-5-1942 మరణం: 11-11-2023

ఓన్లీ చంద్రమోహన్

పాలూ మీగడ... పెరుగూ ఆవడా..
'నేను.. మా ఆవిడా' అన్న
తెలుగు సినిమా మధ్యతరగతి భర్త.
'సీతాపతి సంసారం' చేసి
ఆనాటి గృహిణులను
నవ్వుల్లో ముంచెత్తాడు.
ఏ వూరి 'సీతామాలక్ష్మి' ఐనా ఇష్టపడే
బంగారు కొండయ్య ఇతడే.
'కలికాలం' ధాటికి తల్లడిల్లిన
మధ్యతరగతి తండ్రి.
ఉత్త 'సగటు మనిషి'.
తెలుగు సినిమా ప్రేక్షకుడు
ప్రతి 'శుభోదయాన' తలుచుకోదగ్గ
నట త్రివిక్రముడు.
ఓన్లీ చంద్రమోహన్.




● రంగుల రాట్నం



● గోపాలరావు గారి అమ్మాయి















చంద్రమోహన్ తిని అరాయించుకోని క్యారేజీ లేదు. చేసి నిభాయించని క్యారెక్టరూ లేదు.

•••

అగ్రికల్చర్ బీఎస్సీ అంటే వ్యవసాయ విద్య.
పంటలు పండించడం తెలియాలి.
చంద్రమోహన్ ఆ విద్య చదివాడు.
అందుకేనేమో తెర మీద ప్రతి పాత్రా పండించాడు.

•••

నటులు అయ్యాము, అయిపోయాము, అవ్వాలనుకుంటున్నాము అనుకున్నవారు ఇది ట్రై చేయండి. 'నిన్నే పెళ్లాడతా' సినిమా చూడండి. అందులో చలపతిరావు, చంద్రమోహన్ చాలా స్నేహితులు. పక్కపక్క ఇళ్లల్లో ఉంటారు. కుటుంబాలతో కలిసి అన్నవరం వెళితే ఏనాడో విడిపోయిన చలపతిరావు చెల్లెలు మంజుభార్గవి కనిపిస్తుంది. అయినాసరే చలపతిరావు పలకరించడు. అందుకు లక్ష్మి అభ్యంతరపెడితే చలపతిరావు చెయ్యెత్తుతాడు. చంద్రమోహన్ అడ్డుపడితే– 'ఇది మా ఇంటి వ్యవహారం' అంటాడు చలపతిరావు. అందరూ ఊరికి తిరిగొచ్చాక ,ఇంటి తలుపులు తీసి లోపలికి వచ్చాక, చంద్రమోహన్ తన భార్యతో 'పద మనింటికి' అంటాడు. అందరూ 'ఏంటిది కొత్తగా' అన్నట్టు చూస్తే ఆ క్షణం చంద్రమోహన్ 'అక్కడ నన్ను అంతమాట అంటారా' అన్నట్టు ఒక ఎక్స్‌ప్రెషన్ ఇస్తాడు. ప్రేక్షకుడికి చివుక్కు మంటుంది. ఆ ఎక్స్‌ప్రెషన్ ఎవరైతే ఇవ్వగలరో వారంతా నటులైపోయినట్టే లెక్క.

•••

ఏలూరులో 'అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్'గా ఉద్యోగం వచ్చాక పెళ్లిసంబంధాల గోల మొదలైంది చంద్రమోహన్‌కి. కాని తన తర్వాత 8 మంది చెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్నారు. అప్పటికే తండ్రి చనిపోవడంతో భారమంతా తనదే. కాని నాటకాలంటే ఇష్టం. శరీరాన్ని కండలు తిప్పడం ఇష్టం. సినిమాల్లో చేయాలని కోరిక. ఆదుర్తి తీస్తున్న 'లేత మనసులు' కోసం ప్రయత్నించాడు. కాని కృష్ణ, రామ్మోహన్‌లకు చాన్స్ పోయింది. ఇంకో సినిమా సెలక్షన్‌కు బెజవాడకు పరిగెడితే అక్కడ ఒక పొడవైన మనిషి తనలాగే వచ్చి ఉన్నాడు. తలెత్తి చూసిన చంద్రమోహన్ 'మీ పేరేమిటండి' అనడిగితే 'కృష్ణంరాజు' అన్నాడు. ఇలాంటి ఆజానుబాహులు ఉండగా నాకెందుకు వేషం ఇస్తారు అని అదే పోత.

కాని అవకాశం వెతుక్కుంటూ వచ్చింది.
ఇచ్చినవాడు సాక్షాత్ బి.ఎస్.రెడ్డి.
సినిమా పేరు 'రంగుల రాట్నం'.
అది 1966వ సంవత్సరం.
తెలుగు వెండితెర మీద ఈ రెండార్ల సంవత్సరంలో ఆరారు కాలాలు నిలబడే నటుడు పుట్టాడు.

•••

'కోరిక ఒకటి జనించు.. తీరక ఎడద దహించు
కోరనిదేదో వచ్చు... శాంతి సుఖాలను ఇచ్చు
ఇంతేరా ఈ జీవితం... తిరిగే రంగుల రాట్నము'...

'రంగులరాట్నం'లో పాట ఇది. కాని చంద్రమోహన్‌కు కోరిందే జరిగింది... శాంతి సుఖాలను ఇచ్చింది. మహా దర్శకుడు బి.ఎస్.రెడ్డి ఈ 'పమిడి ముక్కల పొట్టివాడు' మహా గట్టివాడు అని గ్రహించాడు. ఉద్యోగం మాన్పించి, రిస్క్ చేసి, తొలి అవకాశం ఇచ్చాడు. సినిమా పెద్ద హిట్ అయ్యింది. 'ఎవరీ చంద్రమోహన్... ఇది మొదటి సినిమానా?... మొదటి సినిమాలో ఎవరైనా ఇంత బాగా చేయగలరా?' అని అంతా ఆశ్చర్యపోవడమే. మొదటి సినిమాకే చంద్రమోహన్‌కు 'బంగారు నంది' వచ్చింది. అంతా బాగానే ఉంది... అయినా సరే నిలదొక్కుకోలేకపోతే? అని భయం. నంది అవార్డుల ఉత్సవంలో నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి చేతుల మీద నంది అందుకుంటూ 'సార్... నా కెరీర్ అటూ ఇటూ అయితే మళ్లీ మీరు నాకు వ్యవసాయ శాఖలోనే ఏదో ఒక ఉద్యోగం వేయించాలి' అని వేడుకున్నాడు చంద్రమోహన్. ఆయన నవ్వి 'మా బి.ఎన్ లాంచ్ చేస్తే ఫెయిల్ అవడం ఉండదు లేవయ్యా. భయపడకు' అని భరోసా ఇచ్చారు.

పెద్దల మాట చెక్కుల మూట అన్నారు.
వేషాలూ చెక్కులూ ఆ తర్వాత అలాగే వచ్చి పడ్డాయి.

•••

ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కాంతారావుల తర్వాత ఎవరు అనుకుంటున్న కాలం అది. హరనాథ్, బాలయ్య ఒకవైపు కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు మరోవైపు అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఉంటే చంద్రమోహన్ ఎంట్రీ ఇచ్చాడు. 'ఒక జానెడు ఎత్తుంటే మా అందరినీ తినేస్తావయ్యా' అని ఎస్.వి.ఆర్, ఏ.ఎన్.ఆర్ ఆ తర్వాతి రోజుల్లో పదే పదే అన్నా చంద్రమోహన్‌కు ఒక జాన తక్కువ ఉండటమే లాభించింది. అతను మిడిల్‌క్లాస్ కథలకు సరిపోయాడు. చిన్న సినిమాల బడ్జెట్‌కు సరితూగాడు. 1970ల నాటికి మధ్యతరగతి తన ఉనికి చాటుకుంటూ భార్యాభర్తలు సంసారాలు ఈదడానికి అవస్థలు పడుతూ ఉన్నప్పుడు వారి సంసారాలకు, వాటిలోని సనిదపనిలకు చంద్రమోహన్ తెర రూపం అయ్యాడు. 'ఇంటింటి రామాయణం', 'తాయారమ్మ–బంగారయ్య', 'ఒక చల్లని రాత్రి', 'కోరికలే గుర్రాలైతే', 'శుభోదయం', 'నేను– మా ఆవిడ', ' కలహాల కాపురం'... ఎన్నని.

చంద్రమోహన గీతాలు - హిట్ సాంగ్స్ - 10

1. మేడంటే మేడా కాదు - సుఖ దు:ఖాలు
2. ఝుమ్మంది నాదం సయ్యంది పాదం - సిరిసిరిమువ్వ
3. మావిచిగురు తినగానే - సీతామాలక్ష్మి
4. నాగమల్లివో తీగమల్లివో - నాగమల్లి
5. కంచికి పోతావా కృష్ణమ్మ - శుభోదయం
6. కలనైనా క్షణమైనా - రాధా కల్యాణం
7. దాసోహం దాసోహం దాసోహం - పెళ్లిచూపులు
8. లేత చలిగాలులు - మూడుముళ్లు
9. పంటచేలో పాలకంకి నవ్వింది - పదహారేళ్ల వయసు
10. నీ తీయని పెదవులు అందకపోతే - కాంచన గంగ

•••

ఆ రోజుల్లో రేడియో వినడం మధ్యతరగతి వారికి దినచర్య.

'సీతాపతి సంసారం'లో భార్యను ఉద్యోగానికి పంపి, ఇంట్లో హౌస్ హజ్బెండ్‌గా చంద్రమోహన్ రేడియోలో వనితావని కార్యక్రమం కింద వెంకాయమ్మ గారు చెప్పే వంకాయకూర వండబోతాడు. కాని స్టేషన్లు జామ్ అయ్యి యోగా కార్యక్రమం కూడా మధ్యలో వినిపిస్తూ ఉంటుంది. 'వంకాయలను తరిగాక'... ఒక స్టేషన్... 'మెడను ముందూ వెనక్కూ మూడుసార్లు ఊపి'... ఇంకో స్టేషన్... ఒకటే నవ్వులు. ఈ సంసారం చూద్దామని ఆ రోజుల్లో మహిళా ప్రేక్షకులు మొగుళ్లను వెంటబెట్టుకుని ఎన్ని హౌస్‌ఫుల్స్ చేశారో!

•••

దర్శకుడు బాపు 'బంగారు పిచుక' (1968) తీశారు చంద్రమోహన్‌తో. 'సుఖఃదుఖాలు' (1968) లాంటి పెద్ద హిట్ పడ్డాక 'బంగారు పిచుక' హిట్ అయి ఉంటే చంద్రమోహన్ కెరీర్ ఇంకెంత స్పీడ్‌గా ఉండేదో. కాని అవలేదు. కాలం కంటే ముందు తీసిన కథ అది. ఆ దెబ్బతో చంద్రమోహన్ పొట్టగడవడానికి తోచిన పాత్ర చేయాల్సి వచ్చింది. అదే బాపు తీసిన 'సంపూర్ణ రామాయణం'లో చిన్నపాటి భరతుడి పాత్ర కూడా వేయాల్సి వచ్చింది. కాని వరుసకు అన్నయ్య అయ్యే కె.విశ్వనాథ్ తన తమ్ముణ్ణి గట్టిగా నిలబెట్టాలనుకున్నాడు. నిర్మాతను కన్విన్స్ చేసి, తన ఇమేజ్ అడ్డు వేసి 'సిరిసిరిమువ్వ' (1976)లో హీరోని చేశాడు. జయప్రదకు కూడా అది హీరోయిన్‌గా మొదటి సినిమా. విడదలయ్యాక సినిమా పెద్ద హిట్ అయ్యింది. 'గజ్జె ఘల్లుమంటుంటే... గుండె ఝల్లుమంటోంది'.



● సిరిసిరి మువ్వ

•••

1978. చంద్రమోహన్ స్థానాన్ని తెలుగు సినిమాల్లో ఖరారు చేసిన సంవత్సరం. ఆ సంవత్సరమే మురారి తీసిన కె.విశ్వనాథ్ సినిమా 'సీతామాలక్ష్మి' వచ్చింది. అదే సంవత్సరం కె.రాఘవేంద్రరావు తీసిన 'పదహారేళ్ల వయసు' వచ్చింది. 'సీతామాలక్ష్మి' అంటే తెలిసిందే. కె.విశ్వనాథ్ ఎలాగూ హిట్ చేస్తాడు. కాని 'పదహారేళ్ల వయసు' సినిమాయే కత్తి మీద సాము. అది తమిళంలో భారతీరాజా తీసిన 'పదారు వయతినిలే'కి రీమేక్. అందులో పల్లెటూరి వెంగళాయి పాత్రను కమల్ హాసన్ చేశాడు. డీ గ్లామరైజ్డ్ రోల్. చంద్రమోహన్ అలా గోచి కట్టుకుని ఆ పాత్ర చేస్తే మిగిలేది గోచే అని అంతా భయపెట్టారు. తట్టాబుట్టా సర్దుకోవాల్సిందే అన్నారు. అప్పుడే చంద్రమోహన్ తన కొత్తింట్లోకి మారాడు. 'ఈ సినిమా పోతే సెంటిమెంట్ ప్రకారం పాత ఇంట్లోకి వెళ్లిపోదాం' అని భార్య జలంధరతో చెప్పాడు. మొత్తానికి 'పదహారేళ్ల వయసు' రిలీజైంది. ఒకే సంవత్సరం 'సీతామాలక్ష్మి', 'పదహారేళ్ల వయసు' సిల్వర్‌జూబ్లీలు ఇచ్చిన హీరో చంద్రమోహన్. ఎన్టీఆర్, అక్కినేని వంటి టాప్‌స్టార్ల మధ్యలో ఈ వామనస్టార్ కూడా ఉన్నాడు.'పదహారేళ్ల వయసు' తెలుగులో సూపర్ హిట్ అయ్యిందని తెలిసి ప్రత్యేకంగా చూసిన కమలహాసన్ 'మీరు చేసిన దాంట్లో పది శాతం కూడా నేను చేయలేకపోయాను' అన్నాడు. వజ్రం విలువ వజ్రానికే కదా తెలుస్తుంది.

•••

సవాలు విసిరే వేషాలు ఎప్పుడూ చంద్రమోహన్‌నే వరించాయి. తమిళంలో కె.భాగ్యరాజా వచ్చి తనే హీరోగా, దర్శకుడుగా గొప్ప గొప్ప సినిమాలు చేశాడు. అతనితో మేచ్ అయ్యే నటుడు తెలుగులో ఎవరు? చంద్రమోహనే. 'రాధా కల్యాణం' (అంద 7 నాటకల్), 'పెళ్లిచూపులు' (తూరల్ నిన్ను పోచ్చు), 'మూడుముళ్లు' (ముందానై ముడిచ్చు) ఈ భాగ్యరాజ్ సినిమాలన్నీ చంద్రమోహన్ సూపర్‌హిట్ చేశాడు. మెహమూద్ హిందీలో 'పడోసన్' తీసి హిట్ కొడితే దాని రీమేక్ 'పక్కింటి అమ్మాయి' చంద్రమోహన్ హిట్ కొట్టాడు. హిందీ 'హీరో'ను నాగార్జునతో తెలుగులో 'విక్రమ్' పేరుతో తీస్తున్నప్పుడు ఒరిజినల్‌లో ఎంతో ముఖ్యమైన పాత్ర సంజీవ్ కుమార్ చేస్తే అందుకు సరిజోడును దర్శకుడు వి. మధుసూదనరావు, నిర్మాత అక్కినేని వెతికి వెతికి చివరకు చంద్రమోహన్ దగ్గరికే వచ్చారు. 'అమర్ అక్బర్ ఆంథోని' రీమేక్ తెలుగులో 'రామ్ రాబర్ట్ రహీమ్'గా తీయాలనుకున్నప్పుడు తెలుగు వారి రిషి కపూర్ ఎవరు? ఇంకెవరు చంద్రమోహన్.

ఎన్.టి.ఆర్‌తో చిన్నపాటి విభేదం

చంద్రమోహన్‌కు ఎన్.టి.ఆర్‌కు ఆది నుంచి స్నేహం ఎందుకనో కుదరలేదు. చంద్రమోహన్ అక్కినేనితో దాదాపు 40 సినిమాలు చేస్తే ఎన్టీఆర్‌తో వేళ్ల మీద లెక్కించేన్ని సినిమాలే చేశారు. నిజానికి మేకప్‌మేన్ పీతాంబరం ఎన్టీఆర్‌తో 'యాదోంకి బారాత్' రీమేక్ 'అన్నదమ్ముల అనుబంధం' తీయాలనుకున్నప్పుడు చిన్న తమ్ముడి పాత్రకు చంద్రమోహన్‌ను, పెద్ద తమ్ముడి పాత్రకు మురళీమోహన్‌ను తీసుకున్నారు. అయితే ఎన్టీఆర్ చివరి నిమిషంలో ఆ పాత్రను బాలకృష్ణకు ఇచ్చారు. పీతాంబరం ఇరకాటంలో పడ్డారు. షూటింగ్ రోజున మేకప్ వేసుకోవడానికి చంద్రమోహన్ వస్తే అప్పటికే ఆ పాత్ర బాలకృష్ణకు వెళ్లిందని తెలిసింది. ఆ రోజు నుంచి చాలా రోజుల పాటు ఎన్టీఆర్ పట్ల చంద్రమోహన్ కినుకతోనే ఉన్నారు. మరోవైపు నష్టనివారణ కోసం పీతాంబరం అదే యాదోంకి బారాత్‌ను తమిళంలో ఎం.జి.ఆర్‌తో తీస్తే అందులో తమ్ముడి పాత్రను చంద్రమోహన్‌కు ఇప్పించారు– జరిగిన విషయం ఎం.జి.ఆర్‌కు చెప్పి. తమిళ యాదోంకి బారాత్‌లో పెద్దన్న, పెద్ద తమ్ముడిగా ఎం.జి.ఆర్ డబుల్ యాక్షన్ చేశారు. చంద్రమోహన్ ఎం.జి.ఆర్ తమ్ముడిగా చేసి హిట్ కొట్టారు.



● ఎమ్జీఆర్‌తో...

•••

అన్నవరం సత్యనారాయణ స్వామికి ప్రసిద్ధి.
అన్నవరం ప్రసాదానికి ప్రసిద్ధి.
అన్నవరం చంద్రమోహన్‌కి కూడా ప్రసిద్ధి.
ఏనాడైతే ఆ మెట్ల మీద చంద్రమోహన్, రాజ్యలక్ష్మిలతో 'శంకరాభరణం'లో అందమైన ప్రేమ చూపులను దర్శకుడు కె.విశ్వనాథ్ తీశాడో ఆ రోజు అన్నవరం ఎవరు వెళ్లినా భక్తితో పాటు శంకరాభరణం కూడా గుర్తు చేసుకుంటారు. ఒక్క సీన్‌తో చంద్రమోహన్ చేసిన మేజిక్ అది. అతని చేతిలో నుంచి నీళ్ల గ్లాసు ఊరికూరికే జారిపోతే ప్రేక్షకులకు ఊరికూరికే నవ్వు వచ్చింది.

•••

ఎన్టీఆర్ ఏఎన్ఆర్‌ల హయాంలో, కృష్ణ శోభన్ బాబుల హయాంలో, చిరంజీవి బాలకృష్ణల హయాంలో, రాజేంద్రప్రసాద్ రాజశేఖర్‌ల హయాంలో కూడా హీరోగా హిట్స్ ఇచ్చినవాడు చంద్రమోహన్. 'చిన్నోడు–పెద్దోడు' (1988) వరకూ హిట్స్ ఇస్తూనే ఉన్నాడు. ఆ తర్వాత 'అల్లుడు గారు' (1990)తో కేరెక్టర్ ఆర్టిస్ట్‌గా తన సత్తాను నిరూపించుకుంటూ వెళ్లాడు. అతను హీరో అయినా జనం చూశారు. కేరెక్టర్ ఆర్టిస్ట్ అయినా చూశారు. ఉదయ్‌కిరణ్, తరుణ్‌లకు తండ్రిగా వేసినా చూశారు. కృష్ణవంశీ 'గులాబీ' తక్కిన కారణాల రీత్యా ఎంత హిట్టో సరదా తండ్రిగా వేసిన చంద్రమోహన్ వల్ల అంత హిట్టు.

•••

'మీ అభిమాన నటుడు ఎవరు' అని జయసుధను అడిగితే 'ఇంకెవరు చంద్రమోహన్' అంటుందామె తడుముకోకుండా. జయసుధతో దాదాపు 25 సినిమాల్లో హీరోగా చేశాడు అతను. చంద్రమోహన్ పక్కన యాక్ట్ చేస్తే సూపర్‌స్టార్లు అవుతారనే సెంటిమెంట్ హీరోయిన్లకు ఉండేది. వాణిశ్రీ, లక్ష్మి, జయసుధ, జయప్రద, కవిత, సులక్షణ, సుహాసిని, రాధిక, విజయశాంతి... వీరంతా చంద్రమోహన్‌తో చేశాక స్టార్లు అయ్యారు. 'పదహారేళ్ల వయసు' తర్వాత శ్రీదేవి మళ్లీ ఆయనతో చేయలేనంత పెద్ద హీరోయిన్.



● భార్య జలంధరతో...

•••

మిమిక్రీ ఆర్టిస్టులు అందరినీ అనుకరిస్తారు గాని చంద్రమోహన్‌ని కాదు. అతనిలాగా చేయగల వాడు అతనొక్కడే. ఆ డైలాగ్ మాడ్యులేషన్, ముఖంలో పలికించగల ఎమోషన్, కామిక్ టైమింగ్... ఇతరులకు ఎప్పటికీ రావు. కాని చంద్రమోహన్‌లో ఒక్కటే చిన్న లోపం ఉంది. బి.ఎస్.రెడ్డి గారు హెచ్చరించినా.. మార్చాలని చూసినా మారనిది– చేతులు ఊపనిదే డైలాగ్ చెప్పలేకపోవడం. చంద్రమోహన్‌ది ఎడమచేతి వాటం. ఎడమ చేతిని వేగంగా కదిలిస్తూ ఇరు చేతులూ కదిలిస్తూ డైలాగ్ చెబుతాడు.

కనీ వినీ ఎరగని భోజన ప్రియుడు



చంద్రమోహన్ కనీవినీ ఎరగని భోజన ప్రియుడు. సాధారణంగా సినిమా వారు మితంగా తింటారు. కాని అదృష్టవశాత్తు చంద్రమోహన్ శరీర తత్వానికి ఆయన ఎంత తిన్నా ఏమీ ఒళ్లు పెరిగేది కాదు. షూటింగుల్లో ఆయనకు ఐదు డబ్బాల భారీ క్యారేజీ వచ్చేది. అల్లూరి సీతారామరాజు ఔట్‌డోర్‌లో బ్రేక్‌ఫాస్ట్‌లో చంద్రమోహన్ నలభైయాభై ఇడ్లీలు తినడం చూసి గుమ్మడి, పి.జె.శర్మలాంటి వారు నోరెళ్లబెట్టారు. 'ఆకాశంలో ఎగిరేవన్నీ తిన్నాను.. నేల మీద పాకేవన్నీ తిన్నాను... నీళ్లలో ఈదేవన్నీ తిన్నాను' అని సరదాగా తన భోజనప్రియత్వాన్ని అతిశయోక్తితో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు చంద్రమోహన్. అందుకే ఆయన తిని అరాయించుకోని క్యారేజీ లేదు.. వేసి నిభాయించని క్యారెక్టరూ లేదు.

•••

చంద్రమోహన్‌కు అవార్డులు గివార్డులు పట్టవు. సన్మానాలు గిన్మానాలు నచ్చవు. సినిమా చేశామా... ఇంటికి వెళ్లామా ఇదే ధ్యాస. అందరికీ బిరుదులిచ్చే టి.సుబ్బరామిరెడ్డి ఒకసారి ఆయనకు భారీ బిరుదు ఇచ్చి సత్కారం చేస్తానంటే 'మీరు ఇచ్చిన వెంటనే దానికి తిలోదకాలు ఇస్తాను' అని హెచ్చరించినవాడు చంద్రమోహన్. పేరుకు ముందు నట అది.. నట ఇది అని బిరుదులు వేయడం కూడా ఆయనకు ఇష్టం లేదు.

'చంద్రమోహన్‌లా వచ్చాను... చంద్రమోహన్‌లా వెళ్లిపోతాను' అనేవాడాయన.
ఎస్. అలాగే వెళ్లాడు.
హి ఈజ్ ఓన్లీ చంద్రమోహన్.

- ఖదీర్

క్లుప్తంగా...

వ్యాపారాభివృద్ధిపై 21న సాంకేతిక సదస్సు

ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్

సాక్షి, అమరావతి: సామాజిక మాధ్యమాల్లో ప్రకటనల ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తమ వ్యాపారాభివృద్ధి అవకాశాలను వివరించడానికి విజయవాడలో సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలతో వ్యాపారాన్ని ఎలా అభివృద్ధి చేయవచ్చు అనే అంశంపై ఈనెల 21వ తేదీన సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నామని ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ విజయవాడ అధ్యక్షుడు మలినేని రాజయ్య తెలిపారు. ఈ సదస్సు విజయవాడలోని హోటల్ వివంతలో జరుగుతుందని, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, చిన్న, మధ్య తరగతి వ్యాపారులు, కుటీర పరిశ్రమ నిర్వాహకులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఇందుకోసం ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన పనిలేదని, ఉచిత భోజన సౌకర్యం ఉంటుందని వివరించారు. ఆసక్తిగల వారు ఈనెల 18వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు 9848077227 లేదా andhrachambervijayawada@gmail.com లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఈస్టర్న్ ఫ్లీట్ కమాండ్‌గా రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్కర్

స్వోర్డ్ సెర్మనీలో బాధ్యతల స్వీకరణ



రియర్ అడ్మిరల్ గురుచరణ్ నుంచి స్వోర్డ్ ఆర్మీ స్వీకరిస్తున్న రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్కర్

సాక్షి, విశాఖపట్నం: ఈస్టర్న్ ఫ్లీట్ కమాండ్‌గా రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్కర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 11 నెలలుగా ఈ బాధ్యతలు నిర్వర్తిస్తున్న రియర్ అడ్మిరల్ గురుచరణ్ సింగ్ ఢిల్లీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నేవల్ డాక్‌యార్డులో స్వోర్డ్ ఆర్మ్ సెర్మనీ నిర్వహించారు. గురుచరణ్ నుంచి రాజేష్ ధన్కర్ ఫ్లీట్ కమాండ్ స్వోర్డ్‌ని స్వీకరించి బాధ్యతలు చేపట్టారు. 1990లో భారత నౌకాదళంలో చేరిన ధన్కర్ నేవిగేషన్ అండ్ డైరెక్షన్‌లో నిపుణుడు. 33 ఏళ్ల కెరీర్‌లో పాండిచ్చేరి, గోవా, కోరా, మైసూర్ యుద్ధ నౌకల్లో కీలకంగా వ్యవహరించారు. ఐఎన్ఎస్ ఢిల్లీలో ఎగ్జిక్యూటివ్ అధికారిగా, ఐఎన్ఎస్ ఘరియాల్ కమాండింగ్ ఆఫీసర్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.

మద్యం వ్యాన్ బోల్తా

బాటిళ్ల కోసం ఎగబడిన జనం



కొమ్మాది హైవేపై బోల్తా పడిన మద్యం వ్యాన్

మధురవాడ (విశాఖపట్నం): మద్యంతో వెళ్తున్న ఐషర్ వ్యాన్ శనివారం మధ్యాహ్నం కొమ్మాది కూడలి వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడడంతో బాటిళ్ల కోసం జనం ఎగబడ్డారు. ఆనందపురం మద్యం డిపో నుంచి నగరంలోని మూడు ప్రాంతాల్లోని బార్లకు మద్యం అందజేయడానికి బయలు దేరిన వ్యాన్ టైర్ పంచర్ కావడంతో బోల్తా పడింది. ప్రమాదాన్ని గ్రహించిన ఓ కలాసీ వ్యాన్ పైనుంచి దూకేయడంతో స్వల్పంగా గాయపడ్డాడు. మరో కలాసీ, వ్యాన్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. వాహనం బోల్తా పడడంతో బాటిళ్లు రోడ్డుపై పడి పగిలి మద్యం నీరులా ప్రవహించింది. స్థానికులు, వాహన చోదకులు మద్యం బాటిళ్ల కోసం ఎగబడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మద్యం చౌర్యాన్ని కట్టడి చేశారు. క్రేన్‌తో వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. కాగా.. ఈ వాహనంలో సుమారు రూ.35 లక్షల విలువ చేసే 380 కేసుల మద్యం ఉన్నట్లు సమాచారం.

బంగాళాఖాతంలో 14నే అల్పపీడనం!

ఆపై 16న వాయుగుండంగా మారే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 14న అల్పపీడనం ఏర్పడనుంది. తొలుత అదే ప్రాంతంలో 15న అల్పపీడనం ఏర్పడవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అయితే అంతకు ఒకరోజు ముందే అల్పపీడనం ఏర్పడుతుందని ఐఎండీ తమ నివేదికలో తెలిపింది. అనంతరం ఈ అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ 16వ తేదీ నాటికి దక్షిణ బంగాళాఖాతానికి ఆనుకుని మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడుతుందని పేర్కొంది. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ వాయుగుండం అదే దిశలో పయనిస్తుందని ఐఎండీ వర్గాలు తెలిపాయి. వాయుగుండం ప్రభావం ఈ నెల 16 తర్వాత దక్షిణ కోస్తాంధ్రలో మోస్తరు గాను, ఉత్తర కోస్తాంధ్రలో స్వల్పంగాను ఉంటుందని అంచనా. అల్పపీడనం ప్రభావంతో పశ్చిమ మధ్య, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతాల్లో ఈదురుగాలులు వీస్తాయి. ఈ నెల 13 నుంచి కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలకు ఆస్కారముంది.

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి విశేష స్పందన



అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం రామచంద్రపురంలో మా నమ్మకం నువ్వే జగన్ కరదీపికను అందిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



బాపట్ల జిల్లా కొల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



తిరుపతిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి తదితరులు



ఏలూరు రూరల్‌లో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాల ఫ్లెక్సీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్సీ వెంకటరమణ



విజయనగరం జిల్లా బలిఘట్టాంలో వివిధ పథకాలను వివరిస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హరి, జేసీఎస్ ఇన్‌చార్జి మోహన్, ఎంపీటీసీ హేమలత తదితరులు



తూర్పు గోదావరి జిల్లా బల్లిపాడులో ప్రచారం చేస్తున్న సర్పంచ్ ఎల్లిన శివరామకృష్ణ, ఉప సర్పంచ్ దమయంతి, నాయకులు

స్వశక్తితో ఎదిగే మహిళల కోసం

'మహిళా శక్తి'

ఎస్సీ, ఎస్టీ మహిళలు ఆటోల కొనుగోలుకు వడ్డీ లేని రుణం

- లబ్ధిదారులు 10 శాతం చెల్లిస్తే.. 90 శాతం ప్రభుత్వం రుణంగా ఇస్తుంది
- రుణాన్ని 48 నెలలు వాయిదాలుగా చెల్లించే వెసులుబాటు
- మండలానికి ఒకరు చొప్పున ఈ ఆర్థిక ఏడాది 660 మందికి ఆటోలు
- వడ్డీ రాయితీ కారణంగా ఒక్కో లబ్ధిదారునికి రూ.లక్షన్నర దాకా అదనపు లబ్ధి
- డిసెంబరు 6 అంబేడ్కర్ వర్ధంతి రోజున 229 మందికి కొత్త ఆటోలు
- వచ్చే అంబేడ్కర్ జయంతికి మిగిలిన వారికి ఆటోలు



సాక్షి, అమరావతి: మహిళా సాధికారిత లక్ష్యంగా చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వశక్తితో ఎదగాలనుకొనే పేదింటి మహిళలకు చేయూత నిచ్చేందుకు మరో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ మహిళలు కేవలం 10 శాతం ఖర్చుతో వారు ఆటోలు సమకూర్చుకొని, వాటి ద్వారా ఆర్థికంగా బలపడేలా 'మహిళా శక్తి' కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందుకోసం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో 'ఉన్నతి' కార్యక్రమంలో వడ్డీ లేని రుణాలు ఇవ్వనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో డ్రైవింగ్ నైపుణ్యం ఉండీ పలువురు మహిళలు ఆటోలను కిరాయికి తీసుకొని నడుపుకొంటున్నారు. ఇకపై వారు అద్దెవి కాకుండా సొంత ఆటోలు నడుపుకోవడం ద్వారా మరింత ఆదాయం పొందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు 'మహిళా శక్తి'కి రూపకల్పన చేశారు. ఈ పథకంలో ఆటో కొనుగోలుకు అయ్యే ఖర్చులో పది శాతం లబ్ధిదారు అయిన మహిళ భరిస్తే సరిపోతుంది. మిగతా 90 శాతం సెర్ప్ ద్వారా ప్రభుత్వమే రుణంగా అందిస్తుంది. ఈ రుణానికి వడ్డీ ఉండదు. మొత్తం రుణాన్ని 48 నెలలు కిస్తీ రూపంలో చెల్లించుకునే వెసులుబాటు కల్పించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మండలానికి ఒకరు చొప్పున 660 మందికి ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేయూతనందిస్తుంది. ఇప్పటికే 229 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేసి, వారికి డ్రైవింగ్‌లో నాలుగు రోజుల పాటు అదనపు శిక్షణ ఇచ్చారు. ఆటోలకు వచ్చే చిన్న చిన్న సమస్యల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రైవింగ్ సమయంలో భద్రత తదితర అంశాలపై శిక్షణ కూడ పూర్తి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా డిసెంబరు 6వ తేదీన లబ్ధిదారులకు కొత్త ఆటోలు అందజేస్తారు. మిగిలిన మండలాల్లో వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేసి, వారికీ అంబేడ్కర్ జయంతి రోజు ఏప్రిల్ 14న కొత్త ఆటోలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఒక్కొక్కరికీ రూ.లక్షన్నర దాకా అదనపు ప్రయోజనం

సాధారణంగా ఆటోల కొనుగోలుకు బ్యాంకులు లేదా ఇతర ప్రైవేటు ఆర్థిక సంస్థలు రుణాలిస్తాయి. దీనిని నెలవారీ కిస్తీల రూపంలో తిరిగి చెల్లించాలి. వీటిపై కనీసం రూ. లక్షన్నర వడ్డీనే అవుతుంది. ఇది ఆటో డ్రైవర్లకు ఆర్థిక భారమే. మహిళా శక్తి ద్వారా ఆటోలు పొందే లబ్ధిదారులకు ఇచ్చే రుణంపై వడ్డీ లేనందున, వారికి ఈ లక్షన్నర ఆర్థిక ప్రయోజనం అదనంగా కలుగుతుందని అధికారులు వివరించారు.

26 జిల్లాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారుల సంఖ్య

జిల్లా	లబ్ధిదారుల సంఖ్య
శ్రీకాకుళం	15
పార్వతీపురం మన్యం	13
డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	10
ఏలూరు	12
ప్రకాశం	13
నెల్లూరు	13
తిరుపతి	16
చిత్తూరు	12
వైఎస్సార్	13
అన్నమయ్య	10
అనంతపురం	13
శ్రీ సత్యసాయి	6
కర్నూలు	7
నంద్యాల	9
బాపట్ల	9
పల్నాడు	3
గుంటూరు	5
ఎన్టీఆర్	4
కృష్ణా	5
పశ్చిమ గోదావరి	6
తూర్పు గోదావరి	6
కాకినాడ	6
అనకాపల్లి	8
విశాఖపట్నం	2
విజయనగరం	6
అల్లూరి సీతారామరాజు	7

సచివాలయాలపైనా ఏడుపే..

- ఊరూరా సచివాలయాలకు సొంత భవనాలు నిర్మించడంలేదా?
- సచివాలయాలకు నిధులివ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనడం శుద్ధ అబద్ధం
- పంచాయతీ సాధారణ నిధులు ఏ అవసరానికి ఎంతెంత శాతం ఖర్చుపెట్టాలన్న దానిపై నిబంధనలున్నాయి
- అయినా అక్షరం అక్షరంలో అసూయతో ఈనాడు వికృత రాతలు



పంచాయతీలను కాల్లగొట్టి.. | సచివాలయాలకు పంచిపెట్టి..

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులెవరూ గతంలో మాదిరిగా జన్మభూమి కమిటీల చుట్టూ చెప్పులరిగేలా తిరిగే అగత్యం లేకుండా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయాల వ్యవస్థను తీసుకొస్తే 'ఈనాడు' అస్సలు సహించలేకపోతోంది. ముఖ్యమంత్రి స్థానంలో చంద్రబాబు లేరన్న అసూయతో నిత్యం లేనిపోని అబద్ధాలతో ఆ పత్రికను నింపేస్తోంది. ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్న ఈ క్షుద్ర పత్రిక శనివారం 'పంచాయతీలను కొల్లగొట్టి.. సచివాలయాలకు పంచిపెట్టి..' అంటూ పెడబొబ్బలు పెడుతూ గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థపై చేతికొచ్చింది రాసి పారేసింది. నిజానికి.. సచివాలయాలకు నిధులివ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వార్త రాయడంలో ఎలాంటి వాస్తవంలేదని, ఆ వార్త పూర్తిగా సత్యదూరమని ప్రభుత్వం స్పష్టంచేసింది. దేశంలో మరే రాష్ట్రంలోని లేని విధంగా అత్యుత్తమ సేవలందిస్తున్న ఈ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చూసి ఓర్వలేక.. ఈనాడు ఎప్పటిలాగే తప్పుడు వార్తలకు తెగబడింది. ఈ నేపథ్యంలో.. 'ఈనాడు' కథనంపై రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలతో ఫ్యాక్ట్‌చెక్‌ను విడుదల చేసింది. ఆ వివరాలు..

నిధులివ్వకుండా నిర్లక్ష్యం ఒట్టిమాటే..

- రాష్ట్ర ప్రభుత్వం 2019 అక్టోబరు 2 నుంచి 15,004 గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటుచేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరు, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 70–100 ఇళ్లకు ఒక వలంటీరు చొప్పున రెండున్నర లక్షలకు పైగా వలంటీర్లను నియమించింది. వీరిలో ఒక్కొక్కరికీ నెలకు రూ.5వేల చొప్పున పారితోషికం చెల్లిస్తోంది. అంతే కాదు.. ఎలాంటి అవినీతికిగానీ వివక్షకుగానీ తావు లేకుండా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడానికి ఈ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఒకటిన్నర లక్షల మందికి పైగా ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన నియమించింది.
- కొత్తగా ఏర్పాటైన సచివాలయాలకు 30,004 కంప్యూటర్లు, 15,002 యూపీఎస్, 15,002 ప్రింటర్లు, 3,000 ఆధార్ కిట్లు, 2,86,646 ఫింగర్ ప్రింట్ స్కానర్లు పంపిణీ చేసింది. వలంటీర్లతోపాటు ఇతర సచివాలయ సిబ్బంది విధులను వేగంగా నిర్వహించేందుకు.. టెక్నాలజీని ఉపయోగించేందుకు 2,91,590 స్మార్ట్‌ఫోన్లు, సిమ్‌కార్డులను అందజేసింది. వీటన్నింటి కోసం ప్రభుత్వం తొలిదశలోనే రూ.486.71 కోట్లను వెచ్చించింది. వీటికి ఎక్కడ కూడా గ్రామపంచాయతీ నిధులను ఖర్చుపెట్టలేదు.
- మరోవైపు.. సచివాలయాల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ప్రభుత్వం ఎప్పటికప్పుడు అదనంగా నిధులు విడుదల చేస్తోంది. 'జగనన్న సురక్ష శిబిరం' నిర్వహణ కోసమే రూ.25 కోట్లు.. అలాగే 'ఆరోగ్య సురక్ష శిబిరం' కోసం ఇంకొక రూ.22 కోట్లను విడుదల చేసింది. ఇదికాక, అదనంగా రూ.16 కోట్లను మంజూరు చేయగా వాటిని చెల్లించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కానీ, వీటన్నింటినీ పక్కనపెట్టి 'ఈనాడు' సచివాలయాలకు నిధులివ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని వండిన వార్తలో ఎలాంటి వాస్తవంలేదు.
- ఇక ఈ నాలుగేళ్లలో సచివాలయాల నిర్వహణకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఇప్పటివరకు రూ.228 కోట్లు వెచ్చించింది. ఈ నిధులతో ప్రింటర్లు, కంప్యూటర్లు, యుపీఎస్, ఫోన్లు, ఫింగర్ ప్రింట్ స్కానర్ల నిర్వహణను చూస్తోంది. వీటికి ఎక్కడా కూడా పంచాయతీ నిధులను ఖర్చుపెట్టలేదు.
- అలాగే, అన్ని సచివాలయాలకు ఫైబర్‌నెట్ సంస్థ ద్వారా ఇంటర్‌నెట్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రింటర్ల వినియోగంలో వాడే ఇంక్ రీఫిల్స్, స్టేషనరీ సర్టిఫికెట్లు, లామినేషన్ కవర్లను సైతం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ద్వారా ప్రభుత్వమే ఎప్పటికప్పుడు సరఫరా చేస్తోంది.
- రాష్ట్రంలోని వలంటీర్లతో పాటు ఇతర సచివాలయాల సిబ్బంది ఉపయోగించే ఫోన్ల నెలవారీ చార్జీలు కూడా ప్రభుత్వమే చెల్లిస్తోంది. వీటికి కూడా ఎక్కడా గ్రామ పంచాయతీ నిధులను ఖర్చుపెట్టలేదు.
- ఇవన్నీ కాక.. సచివాలయాల్లో ఇతర అదనపు ఖర్చుల కోసం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఇప్పటిదాకా రూ.25 కోట్లను ఖర్చుపెట్టింది. ఇంకా ఏవైనా అవసరాలుంటే కలెక్టర్ల ద్వారా అభ్యర్థనలు పంపితే ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలించి నిధులు విడుదల చేస్తోంది. వీటికీ పంచాయతీ నిధులను ఖర్చుపెట్టలేదు.
- గ్రామ సచివాలయాలు సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. రాష్ట్రంలో 10,893 గ్రామ సచివాలయ భవనాలను మంజూరుచేయగా వాటిలో ఇప్పటికే 5,926 పూర్తయ్యాయి. వార్డు సచివాలయాల అద్దె చెల్లింపుల కోసం ప్రభుత్వం 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.54,56,49,999 చెల్లిస్తే, 2023–24 సంవత్సరానికి రూ.25,30,21,000 చెల్లిస్తోంది.

గ్రామ పంచాయతీ సాధారణ నిధుల కేటాయింపు ఇలా..

రకం	నిధుల శాతం
కార్యాలయ నిర్వహణకు..	30
నీటి సరఫరాకు..	15
పారిశుధ్యం..	15
రహదారులు.. కాలువలకు..	10
ఇతర నిర్దేశిత అంశాల నిర్వహణకు..	10
వీధి దీపాల నిర్వహణకు..	15
ఇతరములు	5

పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి లేదు..

గ్రామ పంచాయతీ సాధారణ నిధులు, ఆర్థిక సంఘం నిధులను గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణ కోసం ఆయా గ్రామ పంచాయతీల తీర్మానాల మేరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఖర్చుచేస్తోంది. 15వ ఆర్థిక సంఘం నిధులుగానీ, గ్రామ పంచాయతీ సాధారణ నిధులుగానీ ఏ అవసరానికి ఎంతెంత శాతం ఖర్చుపెట్టాలన్న దానిపై ఖచ్చితమైన నిబంధనలున్నాయి. ఇందులో ఎక్కడా కూడా పంచాయతీ నిధులను సచివాలయాల కోసం కేటాయించలేదు.

- గ్రామ సచివాలయాల నిర్వహణకు ఆ శాఖ ప్రత్యేకంగా నిధులను విడుదల చేస్తోంది. పైగా వీటి నిర్వహణ ఖర్చుల నిమిత్తం అధికారుల నుంచి పంచాయతీ కార్యదర్శులపై ఎలాంటి ఒత్తిడి లేదు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందుతున్న సేవలకు విశేషమైన స్పందన లభిస్తుండడంతో కేవలం ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేయడానికే ఈ తప్పుడు కథనాన్ని ఈనాడు ప్రచురించిందని ప్రభుత్వం పేర్కొంది.

1,510 మందికి సీట్లు కేటాయింపు

ఏపీఈఏపీసెట్–2023 కన్వీనర్ నాగరాణి

సాక్షి, అమరావతి: ఇంజినీరింగ్ ప్రత్యేక దశ అడ్మిషన్ల ప్రక్రియలో 1,510 మందికి సీట్లు కేటాయించినట్లు ఏపీఈఏపీసెట్–2023 కన్వీనర్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఉన్నత విద్యామండలి జారీ చేసిన జీవో నం.179ని అనుసరించి ఏపీఈఏపీసెట్–2023లో అర్హత సాధించిన అభ్యర్థుల కోసం ఈ ప్రత్యేక అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టామన్నారు. ఈ సంవత్సరానికి మాత్రమే వర్తించేలా ఈ కౌన్సెలింగ్ చేపట్టామని, మొదటి రెండు దశల కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశం పొందలేని విద్యార్థులు ఈ ప్రత్యేక కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ ప్రత్యేక ప్రవేశాలకు కూడా కన్వీనర్ కోటాతో సమానంగా ఫీజు రీఎంబర్స్‌మెంట్‌తో పాటు అన్ని రకాల ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని కన్వీనర్ నాగరాణి వివరించారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 14వ తేదీ లోపు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి



కర్నూలు(అగ్రికల్చర్): 'ప్రభుత్వం ఇటు ఉద్యోగుల సంక్షేమానికి, అటు రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తోంది. దీనిని గుర్తించకుండా కొన్ని పత్రికలు, ప్రతిపక్షాలు విషం చిమ్మడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. దీనిని తిప్పికొట్టాల్సిన బాధ్యత గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపైనా ఉంది..' అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య(ఏపీజీఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి చెప్పారు. కర్నూలులో శనివారం ఏపీజీఈఎఫ్ జిల్లా శాఖ, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించారు. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సీఎంగా జగన్ ప్రమాణస్వీకారం చేసిన వెంటనే లక్ష ఉద్యోగాలు ఇస్తామని ప్రకటిస్తే.. ఎవరూ నమ్మలేదని, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.34 లక్షల మందికి ఉద్యోగాలిచ్చారని గుర్తుచేశారు. ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు ప్రొబేషనరీ కూడా డిక్లేర్ చేశారని, ఇందుకు సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీజీఈఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరవపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ పూర్వ విద్యార్థికి అరుదైన గౌరవం

ఏయూక్యాంపస్: ఆంధ్రా విశ్వవిద్యాలయం (ఏయూ) పూర్వ విద్యార్థికి అరుదైన అవకాశం దక్కింది. అమెరికాలో స్థిరపడిన వయార్టిస్ సంస్థ గ్లోబల్ క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ హెడ్ డాక్టర్ దేవ పురాణం ఇటీవల అమెరికా అధ్యక్షుడు నివాసం ఉండే వైట్‌హౌస్‌లో నిర్వహించిన 2 కార్యక్రమాల్లో పాల్గొనే అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. అమెరికాలో హెల్త్‌కేర్ రంగంలో వ్యయాన్ని తగ్గించే అంశంపై చర్చించడానికి దేశ వ్యాప్తంగా స్వల్ప సంఖ్యలో నిపుణులను ఆహ్వానించగా అందులో దేవ పురాణం ఒకరు. అలాగే, ది నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్, ది నేషనల్ మెడల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ప్రదానోత్సవంలో సైతం ఆయన ప్రత్యేక ఆహ్వానితునిగా పాల్గొన్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌లతో కరచాలనం చేసి, కొద్దిసేపు మాట్లాడారు. ఇటువంటి అరుదైన, ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో భాగమైన దేవ పురాణంని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కాగా, ఏయూలో కెమిస్ట్రీ, ఫార్మసీ విభాగాల్లో ఉన్నత విద్యను, పీహెచ్‌డీని దేవపురాణం పూర్తి చేశారు. తన ఉన్నతికి కారణమైన ఏయూ రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఇటీవల ఫార్మసీ కళాశాల విద్యార్థినుల హాస్టల్ భవనానికి తన తల్లిదండ్రులు లలితా దేవి, కోటిలింగాల మూర్తిల పేరు మీద రూ.50 లక్షలు విరాళమిచ్చారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey No 158/1 B-3A, Kakkalapally Village, Ananthapur - 515 004. A.P., and Printed at Jagati Publications Limited Survey No 158/1 B-3A,Kakkalapally Village, Ananthapur - 515 004. A.P., Editor: V. Murali (Responsible for selection of News under the PRB Act), Phone No. 08554 248892, 248893, Fax No. 248894 RNI Regn No. APTEL/2008/23793.

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం


మృతుడు సాయికృష్ణ

ఉరవకొండ: తండ్రి మందలించడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన రైతు రామాంజినేయులు కుమారుడు సాయికృష్ణ (23) బీటెక్ పూర్తి చేసి, ఇంటి పట్టునే ఉంటున్నాడు. ఏదైనా పని చూసుకోవాలని పలుమార్లు తండ్రి సూచించినా పెడచెవిన పెడుతూ వచ్చాడు. తన వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు తరచూ డబ్బు కావాలంటూ తండ్రిని వేధించేవాడు. ఈ క్రమంలో సోమవారం డబ్బు కోసం తండ్రితో గొడవ పడ్డాడు. పని చూసుకుని డబ్బు సంపాదించుకోవాలని, ఇకపై తాను ఇవ్వనంటూ తండ్రి మందలించడంతో ఇంట్లోకి వెళ్లి క్రిమి సంహారక మందు తాగాడు. ఆలస్యంగా ఈ విషయం గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే సాయికృష్ణను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై ఎస్ఐ వెంకటస్వామి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పీఎంకేవీవై కోర్సుల్లో భాగంగా ఎంఎస్ ఆఫీస్‌పై మూడు నెలల పాటు శిక్షణ కొనసాగుతుంది. 15 నుంచి 35 ఏళ్ల వయసుండి, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారు బయోడేటాతో పాటు పదో తరగతి మార్కుల జాబితా, కలర్ ఫొటో, ఆధార్ కార్డు నకలును ఈ నెల 25వ తేదీలోపు ఐటీఐలో అందజేయాలి. 26న ఇంటర్వ్యూలు ఉంటాయి. కోర్సు పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ అందజేసి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు కోర్సు కో–ఆర్డినేటర్ (79954 82414)ను సంప్రదించవచ్చు.

జీన్స్ ఉత్పత్తుల దుర్గం

- రాయదుర్గంలో వెయ్యికి పైగా చిన్న, పెద్ద పరిశ్రమలు
- యువత అభిరుచులకు అనుగుణంగా డిజైన్ల తయారీ
- దేశంలోని ప్రముఖ నగరాలకు ఎగుమతి
- ప్రత్యక్షంగా 60 వేల మందికి కుట్టుతో జీవనోపాధి


రాయదుర్గంలోని ఓ పరిశ్రమలో పనిలో నిమగ్నమైన కుట్టు కార్మికులు


ఇతని పేరు దాదు. రాయదుర్గంలోని ఓ గార్మెంట్స్ పరిశ్రమలో జీన్స్ ప్యాంట్ల కటింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ 600 నుంచి 800 వరకూ ప్యాంట్లను కట్ చేసి కుట్టు కార్మికులకు అందిస్తాడు. దీంతో ఒక్కరోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1,200 వరకు ఆదాయం గడిస్తున్నాడు.


ఇతను రహిమాన్. రాయదుర్గం నివాసి. రోజూ 600 నుంచి 700ల వరకు ఫీడ్‌ఫామ్ (ఇన్‌సైడ్) ప్యాంట్లను కుడుతుంటాడు. ఒక్కో పీసుకు రూ.1.50 చొప్పున గరిష్టంగా రూ.750 వరకు ఆదాయం ఉంటోంది.


ఇతని పేరు సంతోష్‌నాయక్. రాయదుర్గం మండలం ఆవుల దట్ల గ్రామం. పీస్ వర్క్ కింద రోజూ ఎంత లేదన్నా.. రూ.500లు సంపాదన ఉంటోంది. ఇలా ఈ ముగ్గురే కాదు... రాయదుర్గం ప్రాంతంలోని జీన్స్ పరిశ్రమల్లో కటింగ్ మొదలు... ప్యాకింగ్ చేసి మార్కెట్‌కు తరలించే వరకూ గరిష్టంగా 60 వేల మంది కార్మికులకు జీవనోపాధి ఉంటోంది.

రాయదుర్గం: కర్ణాటకకు కూతవేటు దూరంలో జిల్లా సరిహద్దున ఉన్న రాయదుర్గం పట్టణం.. జీన్స్ ఉత్పత్తులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మారుతున్న యువత అభిరుచులకు అనుగుణంగా జీన్స్ ప్యాంట్ల తయారీలో ఇక్కడి కార్మికులు నిష్ణాతులుగా ఖ్యాతిగాంచారు. అంతేకాక ఇక్కడి జీన్స్ ఉత్పత్తులు ఉమ్మడి తెలుగు రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా, కేరళ తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. రాయదుర్గం ప్రాంతంలో వెయ్యి వరకూ చిన్న, పెద్ద తరహా జీన్స్ పరిశ్రమలున్నాయి. వీటన్నింటిలో 60 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. రోజూ ఎంత తక్కువగా లెక్కించుకున్నా లక్షకు పైగా ప్యాంట్ల ఉత్పత్తి జరుగుతోంది. ఈ లెక్కన ఏడాదికి సగటున రూ.800 కోట్ల నుంచి రూ.వెయ్యి కోట్ల వరకూ టర్నోవర్ ఉంటుందని అంచనా. మార్కెట్ ధర కంటే చౌకగా లభిస్తుండడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, యువత నేరుగా వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు ఆన్‌లైన్ ద్వారా కొనుగోళ్లు సాగిస్తున్నారు.

జీన్స్ క్రేజే వేరు

ఫ్యాషన్ ప్రపంచంలో ఎన్ని రకాల దుస్తులు వచ్చినా జీన్స్‌కు ఉన్న క్రేజే వేరు. ఈ క్రమంలో రాయదుర్గంలో జీన్స్ దుస్తుల తయారీకి సంబంధించిన అన్ని పనులూ జరుగుతుంటాయి. ఇందుకోసం నిపుణులైన కుట్టు కార్మికులూ ఉన్నారు. లేటెస్ట్ ట్రెండ్‌కు తగినట్లుగా జీన్స్ ఫ్యాంట్లు, కోట్లు తయారు చేయడం వీరి ప్రత్యేకత. ముంబై, ఢిల్లీ, బెంగళూరు లాంటి నగరాల్లో యూత్ ఎక్కువగా ఏ డిజైన్స్‌ను ఇష్టపడుతున్నారన్నది గమనిస్తారు. వాటినే ఇక్కడి వ్యాపారులు చేయిస్తున్నారు. షేడ్ జీన్స్, పెన్సిల్ కట్, నెటెడ్ వంటి వాటిని తయారు చేయడంలో వీరు మంచి నిష్ణాతులుగా పేరుగాంచారు. ఒకప్పుడు కుటీర పరిశ్రమగా ఏర్పడిన జీన్స్ ప్యాంట్ల తయారీ ఇప్పుడు పల్లెలకూ విస్తరించింది.

చైనా నుంచి ముడిసరుకు

జీన్స్ ప్యాంట్ల తయారీకి అవసరమైన వస్త్రం, జిప్పులు, గుండీలు, దారం వంటి ముడి సరుకును చైనాతో పాటు దేశంలోని అహ్మదాబాద్, బిల్వార్, బళ్లారి ప్రాంతాల నుంచి ఇక్కడి గార్మెంట్స్ పరిశ్రమల నిర్వాహకులు దిగుమతి చేసుకుంటున్నారు. గతంలో వడ్డీతో కూడిన అరవుపై ముడిసరుకును తెచ్చుకునేవారు. కరోనా తర్వాతి పరిస్థితుల కారణంగా నగదు లావాదేవీలే కొనసాగుతున్నాయి. ఈ కారణంతో చిన్న పరిశ్రమల నిర్వహణ భారంగా మారిందని యజమానులు పేర్కొంటున్నారు.

ఇంట్లో అందరూ కుట్టుపనే


దాదాపు 17 ఏళ్లుగా జీన్స్ ప్యాంట్ల కుట్టుతోనే జీవనోపాధి పొందుతున్నాం. నాతో పాటు కుమార్తె, కుమారుడు కూడా పనిచేస్తున్నారు. ముగ్గురమూ కలసి నెలకు రూ.24 వేల వరకూ సంపాదిస్తున్నాం.

– మల్లమ్మ, 74 ఉడేగోళం, రాయదుర్గం మండలం

ఆర్థిక ఇబ్బందుల్లేవు


ఆర్థిక ఇబ్బందులతో ఐదేళ్ల క్రితం మధ్యలోనే చదువు మానేశాను. ప్రస్తుతం జీన్స్ ప్యాంట్లు కుడుతూ ప్రతి నెలా రూ.10 వేలకు పైగా సంపాదిస్తున్నా.

– రోజా, కుట్టు కార్మికురాలు, భూసముద్రం

కార్మికులకు ఉపాధి


మా పరిశ్రమలో కాటన్ ప్యాంట్ల తయారీకి ఎక్కువ ప్రాధాన్యతనిస్తాం. ఇక్కడి ఉత్పత్తులను పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటాం. జీన్స్ పరిశ్రమల ద్వారా వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నాం.

–కొంతెం దేవరాజు, గార్మెంట్స్ యజమాని, రాయదుర్గం


ఓ పరిశ్రమలో ప్యాంట్లకు దారాలు తొలగిస్తున్న కూలీలు

దుర్గం జీన్స్ ప్రత్యేకతే వేరు


రాయదుర్గంలో జీన్స్ పరిశ్రమల అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించారు. వన్ డిస్ట్రిక్ట్– వన్ ప్రొడక్ట్‌లోనూ రాయదుర్గం జీన్స్‌కు దేశ వ్యాప్తంగా ప్రాచుర్యం దక్కేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మార్కెటింగ్ వ్యవస్థ పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ముడి సరుకును రాయితీతో అందించే అంశంపై ఇప్పటికే సీఎం జగన్‌తో చర్చించాం. భవిష్యత్తులో జీన్స్ పరిశ్రమ యాజమాన్యాలు, కార్మికులకు అన్ని విధాలుగా మేలు చేకూరుతుంది.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

జనవాక్కు

అద్దె బాధ తప్పింది


కొన్నేళ్ల క్రితమే నన్ను, కుటుంబాన్ని వదిలి నా భర్త వెళ్లిపోయాడు. నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడితో కలిసి 30 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే జీవనం సాగిస్తున్నా. గాజుల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. సొంతిల్లు కోసం గత ప్రభుత్వంలో లెక్కలేనన్ని అర్జీలు ఇచ్చాను. మంజూరు కాలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత నాకు కురాకుల తోట జగనన్న కాలనీలో పట్టా ఇచ్చి, ఇల్లు కట్టిచ్చారు. ప్రస్తుతం సొంతింట్లోనే ఉంటున్నా. దీంతో నెలకు రూ.4 వేల అద్దె కట్టే బాధతప్పింది. సొంతింటి కలసాకారం చేసిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. – నబియాభాను, కళ్యాణదుర్గం

కల నెరవేరింది


దాదాపు 15 ఏళ్లుగా రాయదుర్గంలోని వివిధ ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో కాలం నెట్టుకొచ్చాం. నా భర్త శ్రీనివాసులు బొరుగుల బట్టీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నేను కూడా ఇంట్లోనే కుట్టు పని చేస్తుంటా. టీడీపీ హయాంలో ప్రతి జన్మభూమి కార్యక్రమంలోనూ దాదాపు ఓ పదిసార్లు అర్జీ ఇచ్చి ఉంటా. ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే సీఎం జగనన్న మా కల నెరవేర్చారు. మాకు రేషన్‌కార్డు వచ్చింది. బీటీపీ లే అవుట్‌లో ఇంటి స్థలం, రుణం మంజూరు కావడంతో నిర్మాణ పనులు పూర్తయి గృహ ప్రవేశం కూడా చేశాం. ఇదంతా సీఎం వైఎస్ జగన్ చలువ.

– కళావతి, బీటీపీ లే అవుట్ జగనన్న కాలనీ, రాయదుర్గం

సొంతిల్లు సీఎం జగన్ చలువనే


నేను, నా భర్త చంద్రశేఖర్ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం అధికారులను, నాయకులను వేడుకున్నాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ మా ఇంటి వద్దకే వచ్చి వివరాలు తీసుకెళ్లాడు. ఆఫీసు వద్దకు నేను వెళ్లను కూడా వెళ్లలేదు. ఎవరినీ ప్రాధేయపడింది లేదు. అయినా ప్రభుత్వం మాకు ఇంటి పట్టా మంజూరు చేసింది. వలంటీరే ఇంటి వద్దకు తెచ్చిచ్చాడు. మాకు సొంతిల్లు వచ్చిందంటే అదంతా సీఎం వైఎస్ జగనన్న చలువనే.

–ఎస్.పుష్పావతి, కొత్తపేట, గుత్తి మండలం

నా ఆయుష్షు కూడా పోసుకుని...


ఒళ్లు నొప్పులు భరించలేకున్నా. ఎంత మంది డాక్టర్లకు చూపించినా నయం కావడం లేదు. మందులు వేసుకుంటే కాస్త బాగుంటుంది. లేకపోతే నొప్పులు భరించడం చాలా కష్టం. అయితే ప్రతిసారీ మందులు కొనాలంటే డబ్బు లేక ఇబ్బంది పడేదాన్ని. ఈ పరిస్థితుల్లో ఉన్న నాకు జగనన్న ఆరోగ్య సురక్షలో ఇంటి వద్దనే వైద్య పరీక్షలు చేసి నొప్పులకు తగిన మందులు ఇచ్చారు. క్రమం తప్పకుండా వాడితే నయమవుతుందని చెప్పారు. పైసా కూడా ఖర్చు కాలేదు. మందులు అయిపోతే వలంటీరుకు చెబితే తీసుకొచ్చి ఇస్తున్నాడు. ఇప్పుడెంతో బాగుంది. గతంలో ఎన్నడూ ఇలాంటి చికిత్స చూడలేదు. నా ఆయుష్షు కూడా పోసుకుని సీఎం వైఎస్ జగన్ ప్రజలకు మరింత మంచి సేవలు చేయాలని దేవుడినికోరుకుంటున్నా.

–కోనా వెంకటనారాయణమ్మ, కోనుప్పలపాడు గ్రామం, యాడికి మండలం

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

- ట్రాన్స్‌జెండర్లకు కలెక్టర్ గౌతమి పిలుపు


ట్రాన్స్‌జెండర్లకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌జెండర్లకు కలెక్టర్ ఎం.గౌతమి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు, ధ్రువీకరణ పత్రాలను ఆమె పంపిణీ చేశారు. విభిన్నప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ ఏడీ రసూల్, ట్రాన్స్‌జెండర్లు శ్రావణి, గోపిక, మధు తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప యాత్ర జయప్రదం చేయండి

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. సంకల్ప యాత్ర నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ నెల 26వ తేదీ నుంచి 60 రోజుల పాటు సంకల్ప యాత్ర చేపట్టాలన్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. సమావేశంలో సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, మెప్మా పీడీ విజయలక్ష్మి, డీపీఓ ప్రభాకరరావు, ఎల్‌డీఎం సత్యరాజ్, డీఎస్‌ఓ శోభారాణి, డీటీసీ వీర్రాజు, నగర పాలక కమిషనర్ భాగ్యలక్ష్మి, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహషాన్‌బాషా, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ నాగరాజు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కర్ణాటకలో అదృశ్యం.. అనంతలో ప్రత్యక్షం

- హోం వర్క్ చేయలేదని ఉపాధ్యాయుడి చేతిలో దెబ్బలు
- రైలెక్కి వచ్చేసిన విద్యార్థి
- క్షేమంగా కుటుంబసభ్యులకు అప్పగింత


బాలుడిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, తదితరులు

అనంతపురం సిటీ: హోం వర్క్ చేయకపోవడంతో ఉపాధ్యాయుడు దండిస్తూ చెయ్యి చేసుకోవడంతో భయపడిన ఓ విద్యార్థి బెంగళూరుకు వెళ్లే రైలు ఎక్కాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెంటనే అప్రమత్తమై అనంతపురంలో బాలుడిని అదుపులోకి తీసుకుని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి ఎదుట హాజరుపరిచారు. వివరాలు...

కర్ణాటకలోని రాయచూరు జిల్లా దేవదుర్గకు చెందిన నూర్జహాన్ బేగం, హబీబ్‌బాషా దంపతుల కుమారుడు సాకత్ అలీ... అదే ఊళ్లోని హాస్టల్‌లో ఉంటూ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. హోం వర్క్ చేయకపోవడంతో ఆదివారం ఉపాధ్యాయుడు గట్టిగా మందలిస్తూ కొట్టాడు. దీంతో మనస్తాపం చెందిన ఆ బాలుడు పాఠశాల నుంచి వెళ్లిపోయాడు. విషయాన్ని ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే సమాచారం అందించడంతో అన్ని పోలీస్ స్టేషన్లతో పాటు రైల్వే పోలీసులనూ అక్కడి పోలీసులు అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న అనంతపురం ఆర్పీఎఫ్ ఎస్‌ఐ మధుసూదనాచారి, జీఆర్పీ ఎస్‌ఐ విజయ్ కుమార్, సిబ్బంది సోమవారం రాయచూరు నుంచి వస్తున్న రైళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. మిషన్ వాత్సల్య విభాగం డీసీపీఓ వెంకటేశ్వరి, చైల్డ్ హెల్ప్ లైన్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణమాచారి, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, సోషల్ వర్కర్ నాగలక్ష్మి కూడా రైల్వే స్టేషన్‌కు చేరుకుని ఆరా తీశారు. ఇంతలో సాయంత్రం అనంతపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న బెంగళూరుకు వెళ్లే రైలుతో బాలుడిని గుర్తించి, స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడి చిన్నాన్న నవాబ్‌జాన్‌ను పిలిపించి మాట్లాడారు. అనంతరం సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి ఎదుట బాలుడిని హాజరుపరిచి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఐడీబీఐలో అగ్ని ప్రమాదం


బ్యాంకులోని ఫర్నీచర్ దగ్ధమైన దృశ్యం

అనంతపురం క్రైం: నగరంలోని ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ) శ్రీకంఠం సర్కిల్ శాఖలో సోమవారం ఉదయం 9 గంటలకు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బ్యాంక్ నుంచి దట్టమైన పొగలు వస్తుండడం గమనించిన స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. సీఐ రెడ్డప్ప మాట్లాడుతూ.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు తెలిపారు. కొన్ని ఫైళ్లతో పాటు ఫర్నీచర్, కంప్యూటర్లు కాలి బూడిదయ్యాయన్నారు. ఖాతాదారులకు సంబంధించిన ఫైళ్లు, నగదు, తాకట్టులో ఉన్న బంగారు నగలకు ఎలాంటి ప్రమాదం లేదని బ్యాంక్ అధికారులు స్పష్టం చేశారు. మరో రెండు రోజుల్లో సేవలు పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు.

కర్నూలు జిల్లా వాసి ఆత్మహత్య

పామిడి: ప్రేమించిన యువతి దూరం కావడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.... కర్నూలు జిల్లా అంకిరెడ్డిపల్లికి చెందిన మధు కుమారుడు మనోజ్ (20), అదే గ్రామానికి చెందిన సమీప బంధువైన యువతిని ప్రేమించాడు. అయితే ఆమెకు వేరే వ్యక్తి కుటుంబసభ్యులు వివాహం చేశారు. ఈ క్రమంలో కుటుంబసభ్యులకు తెలియకుండా పది రోజుల క్రితం ఆమెను పిలుచుకొచ్చి పామిడిలోని బీసీ కాలనీలో కాపురం పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం పామిడికి చేరుకుని మనోజ్‌ను మందలించి తమ వెంట పిలుచుకెళ్లారు. వివాహితను వీడి ఉండలేని మనోజ్ కూడా అంకిరెడ్డిపల్లికి వెళ్లి ఆమెను పిలుచుకువచ్చే ప్రయత్నం చేశాడు. అయితే అక్కడ అతని మాటకు ఎవరూ విలువనివ్వకపోవడంతో అదే రోజు సాయంత్రం పామిడికి చేరుకున్నాడు. సోమవారం సాయంత్రమైన ఇంటి తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారు పరిశీలించారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న మనోజ్‌ను గమనించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని మనోజ్ మృతదేహాన్ని పామిడి సీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గోదాములో రూ.2.79 కోట్ల విలువైన సరుకు మాయం

తాడిపత్రిటౌన్: మండలంలోని చిన్నపొలమడ సమీపంలో ఉన్న చౌకధాన్యపు గోదాము నుంచి రూ.2.79 కోట్ల విలువైన బియ్యం, కందిబేడలు, చక్కెర, రాగులు, గోధుమ పిండి మాయమైంది. గత మూడు రోజులుగా విజిలెన్స్, రెవెన్యూ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఈ అంశం వెలుగు చూసింది. తనిఖీలు సోమవారంతో ముగిశాయి. అక్రమాలు వెలుగు చూడడంతో గోదామును అధికారులు సీజ్ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలంటూ నివేదికను తాడిపత్రి తహసీల్దార్ అలెగ్జాండర్‌కు అందజేసినట్లు విజిలెన్స్ సీఐ రామారావు, ఎస్‌ఐలు శేషగిరి, జయపాల్‌రెడ్డి తెలిపారు.

'పోలీసు స్పందన'కు 175 వినతులు

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 175 వినతులు అందాయి. వినతులను నగర డీఎస్పీ ప్రసాదరెడ్డి స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు సూచించారు.

పచ్చని పంటను నాశనం చేస్తున్నారు..

ఏటా సాగు చేసిన పంటను కొందరు కావాలని ట్రాక్టర్లతో తొలగించి అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారని ఉరవకొండ మండలం మోపిడి గ్రామానికి చెందిన మహిళా రైతు నీలావతి వాపోయింది. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీ అందజేసిన అనంతరం విలేకరులతో మాట్లాడింది. తన భర్తకు పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన 5.5 ఎకరాల భూమిలో పప్పుశెనగ సాగు చేసినట్లు వివరించింది. రెండు రోజుల క్రితం మదమంచి సురేష్, మదమంచి అభిలాష్, ఇల్లూరు అశోక్, చింతలాంపల్లి శ్యామ్, గాయత్రి... రాత్రికి రాత్రి ట్రాక్టరుతో పంటను పూర్తిగా ధ్వంసం చేశారని ఆరోపించింది. గతేడాది కూడా ఇలాగే పంటను తొలగించారని, అప్పట్లో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఈ సారి నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చినట్లు వివరించింది. దౌర్జన్యపరులపై చర్యలు తీసుకుని తమను కాపాడాలని వేడుకున్నట్లు తెలిపింది.

మహిళల అదృశ్యం కేసులో వీడిన మిస్టరీ

నార్పల: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో గత వారం అదృశ్యమైన ఇద్దరు మహిళల కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివరాలను నార్పల ఎస్ఐ రాజశేఖరరెడ్డి సోమవారం వెల్లడించారు. మాలవాండ్లపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ, మూగే తిమ్మంపల్లి గ్రామానికి చెందిన మరో మహిళ గత వారం వేర్వేరుగా కనిపించకుండా పోయారు. ఈ ఘటనలకు సంబంధించి బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదయ్యాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన సాయంతో మహిళల ఆచూకీని గుర్తించి సోమవారం కుటుంబసభ్యులకు అప్పగించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

యాడికి: కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను విజిలెన్స్ సీఐ వెంకటరమణ, ఏఓ వాసు ప్రకాష్ వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన విజిలెన్స్ అధికారులు సోమవారం తెల్లవారుజామున యాడికి సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహన డ్రైవర్... అధికారులను చూడగానే వాహనాన్ని ఆపకుండా వేగంగా ముందుకు పోనిచ్చాడు. దీంతో అధికారులు మరో వాహనంలో వెంబడించి యాడికి సమీపంలో అడ్డుకున్నారు. బొలెరోలో 17.40 క్వింటాళ్ల రేషన్‌బియ్యం ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి, బియ్యం తరలిస్తున్న రవితేజారెడ్డి, యగవింటి పరుశురాంను పోలీసులకు అప్పగించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు.

24లోపు సిలబస్ పూర్తి చేయాల్సిందే

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ నెల 24 నుంచి ఎస్ఏ–1 పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆలోపు అన్ని పాఠశాలల్లోనూ సిలబస్ పూర్తి చేసి తీరాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఆయన రాష్ట్ర వ్యాప్తంగా ఆర్జేడీలు, డీఈఓలు, మండల విద్యాశాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లా నుంచి డీఈఓ నాగరాజు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు పాల్గొన్నారు. ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ... ఏదైనా పాఠశాలలో సిలబస్ పూర్తి కాకుంటే 24వ తేదీలోపు పూర్తి చేసి పిల్లలను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ట్యాబ్‌ల్లో ఉండే కంటెంట్ ఆధారంగా దాదాపు 50 శాతం మార్కులకు ప్రశ్నలు ఉంటాయన్నారు. ఎక్కడైనా ట్యాబ్‌లు ఇప్పటికీ ఓపెన్ కాకపోతే ఆయా పాఠాల్లోని ప్రశ్నలు, జవాబులు నేర్చుకునేలా చూడాలన్నారు. ఐఎఫ్‌పీలు, స్మార్ట్‌టీవీలు కచ్చితంగా తరగతి గదుల్లో ఉపయోగించాలన్నారు. ఈ విషయంలో ఇప్పటికీ ఎవరైనా కుంటి సాకులు చెబితే సహించబోకూడదన్నారు.